ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

7

గురువారం 11 డిసెంబరు 2025



చలికాలం...అప్రమత్తం





- గతంలో కంటే పెరిగిన చలి
- పిల్లల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

8

పదికి.. వంద రోజుల ప్రణాళిక



- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యా శాఖ కసరత్తు
- ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ
- సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

8



8

ముగిసిన యువజనోత్సవం

- మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకుంటున్న జేకేసీ కళాశాల విద్యార్థులు

పోలీసులకు ఐ కాన్‌గా డ్రోన్లు



- నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతికత
- డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసు సిబ్బందికి శిక్షణ

10 లో..

చెరువులకు మహర్దశ

మున్సిపల్ పట్టణాల్లో చెరువులకు మహర్దశ పట్టింది. తాగునీటి నిల్వలుగా ఉన్న చెరువుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అమృత్ 2.0 పథకంలో చెరువుల సంరక్షణ, సుందరంగా తీర్చిదిద్దడం, ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు భూగర్భజల నీటి నిల్వలు పెరిగేలా పనులు చేపట్టనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ కేంద్రాల్లోని 32 చెరువుల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.92.29 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో ఆయా పనులకు ఎట్టకేలకు పబ్లిక్ హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ నిర్వహించింది. పల్నాడు జిల్లాలో 13 చెరువులను రూ.32.72 కోట్లతో ఆధునికీకరించనున్నారు. గుంటూరు జిల్లాలో కార్పొరేషన్ సహా 12 చెరువులు రూ.45.38 కోట్లతో, బాపట్ల జిల్లాలో 7 చెరువుల ను రూ.14.10 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

అమృత్ 2.0లో ఆధునికీకరణ

- టెండర్ నిర్వహించిన పబ్లిక్ హెల్త్ శాఖ
- రూ.92.29 కోట్లతో మున్సిపల్ చెరువుల అభివృద్ధి

ఆధునికీకరణ ఇలా..

- ఆక్రమణలు తొలగించి హద్దుల నిర్ణయం
- చెరువుల్లో పూడిక తీత
- చెరువు కట్టల పటిష్ఠతకు రాతితో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- పట్టణ వాసుల నడకకు అనుకూలంగా కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- ట్రాక్ చెరువు వైపు ఇనుప వైరుతో ఫెన్సింగ్ ఏర్పాటు
- చెరువు బయట వైపు కట్టలపై పచ్చిక పెంపకం

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం కింద పురపాలక సంఘాల్లోని చెరువులను ఆధునికీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే అమృత్ లక్ష్యం. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో పూడిక పేరుకుపోయి రూపు రేఖలు కోల్పోయిన చెరువులకు మహర్దశ పట్టింది. అమృత్ 2.0లో 32 చెరువులు ఆధునికీకరణకు ఎంపిక కాగా రూ.92.29 కోట్లు విడుదలయ్యాయి. ఈ క్రమంలో పబ్లిక్‌హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ చేపట్టింది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే (మిగతా 10వ పేజీలో)

నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు



అజ్ఞాతంలో.. భోక్తలు



- జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్.. పరారీ
- అజ్ఞాతంలో మాజీ డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు
- రూ.22.25 కోట్ల కుంభకోణంపై చర్యలతో ఉలికిపాటు
- ఫోర్జరీ దస్తావేజులతో రూ. కోట్ల రుణాల కేసులో 11 మంది అరెస్టు

వీరిపై కేసులు..

డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు నాటి బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి (ఏ1), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తొర్లికొండ కృష్ణ వేణి(ఏ2), నాటి అప్రైజర్ యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్(ఏ3), నాటి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము(ఏ4), డైరెక్టర్లు నల్లపాటి రామయ్య(ఏ5), కోట హరిబాబు(ఏ6), వట్టికొండ కోటేశ్వరమ్మ(ఏ7), పీట వెంకటేశ్వర్లు (ఏ8), గోవిందనాయక్(ఏ9), వెలిశెల ఏడుకొండలు(ఏ10), కూని శెట్టి శివనవీన్ (ఏ11)లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే కేసులో నిందితుడైన లాల్‌పురం రాము 10 రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.22 కోట్ల కుంభకోణం కేసులో నిందితుడైన నాటి బ్యాంకు చైర్మన్, వైసీపీ నాయకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము పరారీలో ఉన్నారు. ఆయన చైర్మన్‌గా కొనసాగిన సమయంలో నల్లపాడు బ్యాంకు బ్రాంచ్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై కలెక్టర్ ఆదేశాలతో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే అవకతవకలపై బ్యాంకు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కే శీనారెడ్డి దర్యాప్తు చేస్తుండగా విషయాన్ని రాముతో సహా నాటి మాజీ డైరెక్టర్లు అందులో పాత్ర ఉన్న బ్యాంకు ఉద్యోగులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో తమపై కేసు తప్పదని (మిగతా 10వ పేజీలో)

అసైన్డ్‌పై.. కొరడా



- అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూముల ఫ్రీహోల్డ్
- నాడు మూడు జిల్లాల్లో 4,200 బాధితుల వినతులు బుట్టదాఖలు
- నిర్దిష్ట కాలపరిమితితో న్యాయం చేసే దిశగా నేడు ప్రభుత్వ కార్యాచరణ

చట్ట సవరణ ముసుగులో..

2003కు ముందు పేదలకు అసైన్డ్ చేసిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించేలా ఫ్రీహోల్డ్ చేయడానికి గత ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఈ చట్ట సవరణ ముసుగులోనే వైసీపీ పెద్ద ఎత్తున అసైన్డ్ అక్ర మాలకు పాల్పడింద నే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఒరిజినల్ అసైనీలను భయభ్రాంతులకు గురిచేసి మరీ భూములను ఫ్రీహోల్డ్ చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. పల్నా డు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో దాదాపు 15,000 ఎకరాలను నిబంధనలకు విరు ద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే 2,686 ఎకరాల ను ఫ్రీహోల్డ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే అసైన్డ్ చట్ట సవ రణ ఆధారంగా దాదా పు 6,000 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ బాట పట్టినట్లు సమాచా రం. ఇక ఈ చట్టంతో సంబంధం లేకుం డా స్థానికంగా ఉండే నేతల మాటలే ఆదేశాలుగా వేల సంఖ్యలో భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించి అప్పనంగా దోచేశారు. ఉద్దేశపూర్వకంగా లిటిగేషన్‌లో పడేసి నిషేధిత జాబితాలో దాదాపుగా పదివేల ఎకరాల భూములను చేర్చారని సమాచారం. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అసైన్డ్ అక్రమాలను ఆధారాలతో సహా నిలదీసినా పట్టించు కోలేదు. ప్రస్తుతం ఆయా అసైన్డ్ అక్రమాలపై నిగ్గు తేల్చి త్వరితగతిన వివాదాలకు ముగింపు పలకాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు పాతరేస్తూ, రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా గత ప్రభుత్వంలో అసైన్డ్ భూ దందా ఆకాశమే హద్దుగా సాగగా.. కూటమి ప్రభుత్వం ఆయా అక్రమాలపై చర్యలకు సిద్ధమైంది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 4,200 వినతులు వైసీపీ ప్రభుత్వంలో అందగా వాటిని బుట్టదాఖలు చేసి భూ అక్రమార్కులకు నాటి పాలకులు వత్తాసు పలికారు. అసైన్డ్ అక్రమాలపై విచారణ జరిపి, అడ్డగోలు వ్యవహారాలపై చర్యలు తీసుకుంటామని కూటమి నేతలు ఎన్నికలకు ముందే బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ల నుంచి అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ జాబితాపై నివేదికలను (మిగతా 10వ పేజీలో)

1252 దస్త్రాలు.. 664 పరిష్కారం

- ఈ ఆఫీస్ ఫైల్స్ డిస్పోజ్ రిపోర్టును వెల్లడించిన ప్రభుత్వం
- సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు సగటున ఒక రోజు సమయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 9 వరకు కలెక్టర్ లాగిన్‌కు 1252 దస్త్రాలు రాగా, 664 అర్జీలపై స్పందించినట్లు ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. మెరుగైన పౌర సేవలు అందించే దిశగా ప్రభుత్వం ఈ-ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్ రిపోర్టును బుధవారం వెల్లడించింది. ప్రజల సమస్యలను ఎంత వ్యవధిలో నోటీసు చేయబడుతున్నాయనే అంశంతో పాటు ఎన్ని అర్జీలు వస్తున్నాయి, వాటిలో ఎన్ని పరిష్కరించబడుతున్నాయనే వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. జేసీ వివిధ సమస్యలపై స్పందనకు సగటున ఒక రోజు వ్యవధి తీసుకున్నట్లు తేల్చింది. జిల్లాకు చెంది న మంత్రులు అనగాని ఈ ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్ కోసం సగటున 4 రోజులు సమయం తీసు కొంటుండగా, మరో మంత్రి గొట్టిపాటి ఆరురోజుల వ్యవధి తీసుకున్నారు. సమస్యల పరిష్కారం లో మరింత వేగం చూపాలని సీఎం చంద్రబాబు అధికారులు, మంత్రులకు మార్గనిర్దేశనం చేశారు.

వరి వంగడాల ఉత్పత్తి అభినందనీయం

- బాపట్ల పరిశోధనా కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో 14 రకాల వరి వంగడాల ఉత్పత్తి అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానాన్ని బుధవారం పరిశీలించిన కలెక్టర్ శాస్త్రవేత్తల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వివిధరకాల వరి విత్తనాలను పరిశోధించి ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. బ్లాక్, రెడ్‌రైస్ కూడా ఇక్కడే ఉత్పత్తి చేశామని కలెక్టర్‌కు చెప్పారు.

వ్యవసాయ ఉత్పాదకత పెరగాలి

వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెరగాలని కలెక్టర్ తెలిపారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రాథమిక సెక్టార్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు తగినట్లుగా వ్యవసాయోత్పత్తులు అధికం కావాలని కలెక్టర్ చెప్పారు. ప్రజల తలసరి ఆదాయం పెరగాలంటే అన్ని పంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 41 అంశాలలో పురోగతి సాధించాలన్నారు. ఉద్యానవన పంటలసాగు 500 హెక్టార్లు ఉండగా 60శాతం విస్తరణ జరగకపోవటం ఏమిటని నిలదీశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గింపుపై క్షేత్రస్థాయిలో కమిటీలు పనిచేయాలన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించం

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేదిలేదని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. రైతులు ఆర్.ఎస్.కెలకు తెచ్చిన ధాన్యానికి ధ్రువీకరణపత్రం ఇవ్వకపోతే అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలు నేరుగా మిల్లర్ యజమానులు లేదా కస్టోడియం అధికారులతో మాట్లాడాలన్నారు. మిల్లర్‌లు ఇబ్బందులు పెట్టి తక్కువ ధరకు విక్రయించాలని ప్రయత్నిస్తే డెకాయి ఆపరేషన్ చేపడతామన్నారు. ప్రతిరైస్ మిల్లుకు మూడుసే సీసీకెమెరాలు అమర్చాలన్నారు.



పంటలను పరిశీలించి శాస్త్రవేత్తలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అటవీ సంపదకు రెక్కలు

అక్రమంగా తరలిపోతున్న కలప

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం ముత్తాయిపాలెం ఏ, బీ బీట్ల పరిధిలో 4 వేల ఎకరాలకు పైగా అటవీ భూములు ఉన్నాయి. జీడిమామిడితోపాటు యూకలిప్టస్ చెట్లు ఇతర వృక్షాలు పెద్దఎత్తు న్నాయి. చెట్లు పెద్దవి అయిన తర్వాత ఉన్నతాధికారుల అనుమతితో వేలం నిర్వహించాలి. అందుకు విరుద్ధంగా కొంతమంది ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది సహకారంతో కలప పెద్దఎత్తున అక్రమంగా తరలిస్తున్నారు. అటవీశాఖాధికారుల అండతో నిత్యం పర్యాటకుల రాకపోకలతో రద్దీగా ఉండే సూర్యలంక సముద్రతీరంలోని ఆదర్శనగర్ అటవీప్రాంతంలో పెద్దఎత్తున యూకలిప్టస్ చెట్లు ముక్కలుగా కోసి తరలిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే చెట్లు కోసి తరలిస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు చోద్యం చూస్తూ వచ్చారు.



ఆదర్శనగర్ అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ తోటలు (ఇన్‌సెట్లో) చెట్లు ముక్కలుగా కోసి ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

అటవీభూములలో పెరిగిన చెట్లను యంత్రాలతో కోయించి అక్రమార్కులు తరలిస్తుండగా స్థానికులు దీనిని చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఫారెస్ట్ అధికారులు స్పందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హెచ్.జీవన్‌కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వై.బాలకృష్ణలు సిబ్బందితో కలిసి కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నారు. అప్పటికే కొన్ని ట్రాక్టర్‌ల కలప తరలి వెళ్ళినట్లు గుర్తించారు. ఒకచోట డంప్ చేసిన కలపను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నారు.

53చెట్లు నరికినట్లు గుర్తించాం

ఆదర్శనగర్ అటవీప్రాంతంలో 53 చెట్లను కోసి ముక్కలుగా చేసి ట్రాక్టర్లలో తరలిస్తుంచినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వై.బాలకృష్ణ తెలిపారు. ఇప్పటికే రెండుట్రాక్టర్‌ల కలపను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా ఎక్కడైన డంప్ చేశారా లేక విక్రయించారా అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా చెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేశామని, కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు మార్జిన్ల ఆక్రమణ

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో రోడ్డు మార్జిన్లు, డ్రెయినేజీలను పలువురు



21వ వార్డులో రోడ్డు మార్జిన్‌లో నిర్మాణం

యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. స్థానిక 21వ వార్డులో ఓ వ్యక్తి తన ఇంటిని ఆనుకుని రోడ్డు మార్జిన్‌గా ఉన్న కొంత ప్రభుత్వ స్థలాన్ని చదును చేసుకుని నిర్మాణాలు సాగిస్తున్నాడు. దీని వల్ల మురుగుపోయే మార్గం లేక వ్యర్థ జలాలు రోడ్డుపైకి చేరే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఆక్రమణలతో పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణ, డ్రెయిన్‌లో పూడికతీత తలనొప్పిగా మారింది. అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. డ్రెయిన్లు, రోడ్డు మార్జిన్లు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు.

నామ్‌లో భూసేకరణకు రూ.3.44 కోట్లు

మంత్రి గొట్టిపాటి కృషితో నిధులు మంజూరు

అద్దంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్) రోడ్డులో అసంపూర్తి పనులకు లైన్‌క్లియర్ అయ్యింది. నామ్ రోడ్డులో అద్దంకి మండలం చక్రాయపాలెం, గోపాలపురం, సంతమాగులూరు మండలం ఏల్చూరు ల వద్ద భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లింపు జరగలేదు. దీంతో గత దశాబ్ద కాలంగా పనులు అసంపూర్తిగా నిలిచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అసంపూర్తిగా ఉన్న పనులతో పాటు రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలుమార్లు సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోయారు.. దీంతో భూసేకరణకు రూ.3.44 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రైతులకు పరిహారం చెల్లించి నామ్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని మంత్రి రవికుమార్ తెలిపారు.



గోపాలపురం వద్ద నిర్మాణం పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డు

ఏషియన్ పోటీల్లో చంద్రికకు కాంస్యం


బొల్లినేని చంద్రిక

మంగళగిరి సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక 84 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించింది. టర్కీలో ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ఏషియన్ సీనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చంద్రిక స్క్వాట్ విభాగంలో రజతం, బెంచిప్రెస్‌లో కాంస్యం, డెడ్‌లిఫ్ట్‌లో కాంస్యం సాధించి ఓవరాల్‌గా కాంస్య పతకం సొంతం చేసుకుందని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. చంద్రికను ఆమె కోచ్ నరేంద్రను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

47,152 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 48,555 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,152 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,892 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	17200	334	10500	17000
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	----	----	273	----	----
341	10500	16500	341	11000	16400
4884	----	----	4884	11500	14300
సూపర్ 10	----	----			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15700	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	16900
బ్యాడిగి	10500	15700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16500	తాలుకాయలు	5000	7500
ఆర్మూరు	10500	12800			

గ్రావెల్ సరఫరాకు కమిటీలు

- కమిటీలకు చైర్మన్లుగా ఐదు జిల్లాల కలెక్టర్లు
- మెంబర్ కన్వీనర్‌గా జిల్లా గనులశాఖ అధికారి
- సీఆర్డీఏ ప్రతినిధి, ఆర్డీవో సహా మరో ఐదుగురు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు చేపడుతోంది. రాజధాని పరిధిలో జరుగుతున్న పనులకు అవసరమైన గ్రావెల్, రోడ్డు మెటల్, ఇసుక సరఫరా చేయడంలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాజధాని మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే ఐదు జిల్లాల్లో ఐదు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో కమిటీలు

సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ఆయా జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు కలెక్టర్లు చైర్మన్లుగా వ్యవహరిస్తారు. జిల్లా గనుల శాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితోపాటు సీఆర్డీఏ ప్రతినిధి, సంబంధిత ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) జోనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, జిల్లా అటవీ అధికారి, సీఆర్డీఏలోని కాంట్రాక్టర్ల ప్రతినిధులు కొందరు సభ్యులుగా ఉంటారు.

● త్వరితగతిన అనుమతులు

ఈ కమిటీ గ్రావెల్, రోడ్ మెటల్, ఇసుక సరఫరాకు సంబంధించిన లీజులను మంజూరు చేయడం, సరఫరాలో జాప్యం జరగకుండా చేయడం వంటి పనులను పర్యవేక్షిస్తుంది. సీఆర్డీఏ సూచించిన కాంట్రాక్టు సంస్థల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, వాటికి రెవెన్యూ శాఖ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) కాలుష్య నియంత్రణ మండలి నుంచి పర్యావరణ అనుమతులు వేగంగా వచ్చేలా ఈ కమిటీ చూస్తుంది. అందుకోసం సింగిల్ విండో విధానాన్ని కమిటీ అనుసరిస్తుంది. కాగా రాష్ట్రస్థాయి కమిటీకి సీఆర్డీఏ అదనపు కమిషనర్ చైర్మన్‌గా ఉంటారు. గనులశాఖ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా ఉంటారు. మిగిలిన అన్నివిభాగాల ఉన్నతస్థాయి అధికారులు రాష్ట్ర స్థాయి కమిటీలో ఉంటారు. జిల్లాస్థాయి కమిటీలు వారానికోసారి, రాష్ట్రస్థాయి కమిటీ 15 రోజులకోసారి సమావేశమై మెటీరియల్ సరఫ రా, అవసరమైన అనుమతులపై సమీక్ష జరుపుతాయి. సమస్యలుంటే వాటిని వారం రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాయి.

14న యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం


ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎన్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఎస్ ప్రసాద్ తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో ఆహ్వానపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యూ.రాజశేఖర్, ఎం కళాధర్ మాట్లాడుతూ, కౌన్సిల్ సమావేశానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామని వెల్లడించారు. అలాగే ఉపాధ్యాయ వర్గ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి.ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్
- మండల ప్రత్యేక అధికారి శ్రీ కృష్ణ దేవరాయలు

మాచవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న ఎంపీపీ ఎన్నిక నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల ప్రత్యేక అధికారి, ఎన్నికల అధికారి శ్రీ కృష్ణ దేవరాయలు బుధవారం తెలిపారు. ఇటీవల ఎంపీపీ దారం అంబులమ్మ మరణించటంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల సందర్భంగా పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే సభ్యులందరికీ నోటీసుల ద్వారా సమాచారం అందించామని చెప్పారు. ఎన్నిక నిర్వాహణ సక్రమంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ముందుగానే సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

వినుకొండటౌన్, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): కారు ఆటో ఎదెరెదురుగా ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని చీకటీగల పాలెం వద్ద బుధవారం జరిగింది. నూజండ్ల మండలం పాత చెరుకుపాలెం గ్రామానికి చెందిన ఈదర అచ్చిబాబు (40) వినుకొండ నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అచ్చిబాబు అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కోటేశ్వరమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మశీ విద్యలో నాణ్యత పెంచాలి

● ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జశుబాయి


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న జశుబాయి హీరాబాయ్ చౌదరి తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మశీ విద్యలో నాణ్యత పెంపొందించడానికి బయో మెట్రిక్ హాజరు వ్యవస్థ ఎంతో కీలకమని ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జశుబాయి హీరాబాయ్ చౌదరి అన్నారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో బుధవారం ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫార్మసీ కాలేజీల్లో ఫ్యాకల్టీ, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ఇది సహాయపడుతుందని అన్నారు. అనంతరం సదస్సులో పీసీఐ ఐటీ విభాగం చైర్మన్ డాక్టర్ పి.సత్యమూర్తి, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, ఏపీసీఐ ప్రతినిధులు డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ ఎమ్ ప్రసాదరావు, విజ్ఞాన్ ఫార్మశీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస్ బాబు, బాపట్ల ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న భవిష్యనిధి అదాలత్

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న భవిష్యనిధి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడానికి ఈ నెల 12న భవిష్యనిధి అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.50 వరకు కృష్ణనగర్‌లోని కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలుంటే ఈ మెయిల్ (ro.guntur@epfindia.gov.in),వాట్సాప్ (9494657469) ద్వారా పంపవచ్చన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం నాటికి 575.90 అడుగులు ఉంది. ఇది 2713.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,156 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 50,623 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,623 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 43.01 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

స్త్రీ శక్తితో ప్రభుత్వానికి మంచి పేరు

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించేలా స్త్రీ శక్తి పథకం అమలుతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు, ప్రఖ్యాతలు వస్తున్నాయని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. అదే సమయంలో సిబ్బందిని రిక్రూట్ చేయకుండా, బస్సులు పెంచకుండా ఉంటే మంచిదికాదని ఆయన పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని కొత్తపేట మల్లయ్యలింగం


సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు తదితరులు

భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిబ్బంది చిన్న చిన్న పొరపాట్లకు కూడా క్షమించకుండా సస్పెండ్‌లు, తీవ్రమైన ఇక్రిమెంట్‌లు, పనిష్‌మెంట్లు చేస్తున్న విధానాలను డిపో మేనేజర్లు మానుకోవాలని అన్నారు. ఈ నెల 14న విజయవాడలో జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణలను ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, నాయకులు ఈ. విజయ్‌కుమార్, రత్నాకర్, డీవీ స్వామి, వలి, జి.ప్రకాశ్, వాకా రమేష్, త్రిలోచన దత్తు, తదితరులున్నారు.

● ఆర్టీసీ ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు

సమావేశం అనంతరం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు నూతన కమిటీని ప్రకటించారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్ శ్రీనివాసరావు (టోపీ శ్రీను), రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కేవీఎస్ నరసింహారావు, నెల్లూరు జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె లక్ష్మయ్య, నెల్లూరు జోన్ సహాయ కార్యదర్శిగా జి ప్రకాశ్, జిల్లా జాయింట్ సెక్రటరీగా జి కృష్ణవేణి, జిల్లా ముఖ్య సలహాదారుగా కె దండేశ్వరుడులతో కూడిన కమిటీని ప్రకటించారు.

ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చాలి

● డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల కనీస అవసరాలు తీర్చేలా ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ కోరారు. అరండల్


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్ తదితరులు

పేటలోని కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. మానవ హక్కులు, కనీస అవసరాలైన రక్షిత మంచి నీరు, స్వచ్ఛమైన గాలి, పౌష్టికారం, గృహవసతి, మెరుగైన ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలని కోరారు. మానవ హక్కుల కార్యకర్త ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ, 2029 నాటికి ఎనిమిది సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్‌ను చేరేందుకు ప్రతి ప్రభుత్వం కృషి చేయాలని, మన దేశంలో వివిధ రంగాల్లో మనం ఇంకా ఎంతో వెనకబడిపోయి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో న్యాయవాది పొందుగల ప్రకాష్, బీసీ ఉద్యమ రాష్ట్ర నేత ఉగ్గం సాంబశివరావు, గెజిటెడ్ ఆఫీసర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుస్సా రత్న ప్రసాద్, ఆవాజ్ నాయకులు చిష్టి సామాజిక వేత్త డాక్టర్. మూకిరి సుధా, వాయిస్ ఆఫ్ జస్టిస్ నేత ప్రశాంతి, చంద్రనాయక్, తురకా వీరయ్య, నల్లపు నీలాంబరం, కొరివి రజనీష్, పాలకాయల వెంకట్, ప్రకాష్, బి సురేంద్ర, సూరిబాబు, రామారావు, మద్ద శ్యామ్, సురేష్, పిల్లి రమేష్ తదితరులున్నారు.

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం నిమిత్తం భూములను అందజేసిన ఉండవల్లి గ్రామ రైతులకు ఈ లాటరీ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ఈ కార్యక్రమం బుధవారం రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగింది. 11 మంది రైతులు, భూ యజమానులకు ఈ-లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. వీటిల్లో 11 నివాస ప్లాట్లు కాగా 5 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్ని కృష్ణ మాట్లాడుతూ, ప్లాట్లు ఎక్కడ దక్కాయో రైతులకు వివరించేందుకు ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బందిని, గ్రామ సర్వేయర్లను నియమించామని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ పక్రియకు ఎలాంటి రుసుము వసూలు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


ప్లాట్లు పొందిన రైతులకు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఆర్డీఏ డీసీ చిన్ని కృష్ణ

పశువుల్లో పిండోత్పత్తి, పిండమార్పిడిపై జాతీయస్థాయి శిక్షణ

గుంటూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో పిండోత్పత్తి, పిండమార్పిడిపై జాతీయ స్థాయిలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గుంటూరు సమీపంలోని లాంలో ఉన్న పశు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ ఎం ముత్తారావు తెలిపారు. లాం ఫారము నందు ఈ నెల 11 నుంచి 20 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఆయన బుధవారం తెలిపారు. దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. దేశంలో ఉన్న దాదాపు 20 కోట్ల గోజాతి పశువులలో 75-80% దేశవాళీ ఆవులున్నాయన్నారు. ఈ దేశవాళీ గోవుల వారసత్వ సంపద మాత్రమేగాక, గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి ఇతోధికంగా దోహదం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా భూమి లేని, చిన్న, సన్నకారు రైతుల ఇంటిల్లిపాది అవసరాలకు దేశవాళీ ఆవుల పాత్ర ఎంతగానో వుంటుందన్నారు. భారత ప్రభుత్వం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా దేశవాళీ ఆవులలో ఉత్పాదక శక్తిని(పాలదిగుబడి) పెంచడానికి చేపట్టిన వినూత్న కార్యక్రమమే ఈ 'పిండోత్పత్తి, పిండ మార్పిడి జీవసాంకేతిక ప్రక్రియ' అని తెలిపారు. ఈ నూతన ప్రక్రియను చేపట్టి అందులో శాస్త్రవేత్తలను నిష్ణాతులుగా తయారు చేసే బాధ్యతను లాం ఫాంలోని పశు పరిశోధనా స్థానానికి అప్పగించారని తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబరులో మొదటి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జరిగేది రెండో దశ శిక్షణా కార్యక్రమమన్నారు.

వైసీపీ నాయకులకు అర్థంకాని పీపీపీ విధానం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పీపీపీ విధానం అర్థంకాక వైసీపీ నాయకులు కల్లు తాగిన కోతుల్లా ఎగురుతున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఎద్దేవా చేశారు. బుధవారం అందుకూరులో నిర్వహించిన వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీపీపీ విధానంపై వైసీపీ నాయకులకు అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు. తమ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ నాయకులు తిరుగుతున్నారని, కోటి సంతకాల కార్యక్రమం పెద్ద డ్రామా అని అభివర్ణించారు. చంద్రబాబు ఏ పని చేసినా ప్రజల దీర్ఘ కాలిక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని చేస్తారన్నారు. పీపీపీ విధానంపై కనీస అవగాహన లేకుండా వైసీపీ నాయకులు దాన్ని వ్యతిరేకించటం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసిన ఏ విధానం కూడా విఫలం కాలేదని, ఈ విధానాన్ని కూడా ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏహూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పరీక్షలు ప్రారంభం


పరీక్షలు జరిగే తీరును పరిశీలిస్తున్న పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ పరిధి ఇంజనీర్ విభాగంలో బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ పరీక్షలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల పరిధిలోని బాపట్లలో పరీక్ష కేంద్రంలో కూడా నిర్వహించామన్నారు. పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని తెలిపారు.

వ్యక్తికి జీవిత ఖైదు

● తల్లిదండ్రులను హత్య చేసినందుకు శిక్ష


పాగోలు కిరణ్ చంద్ర (ఫైల్‌ఫొటో)

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అత్యంత క్రూరంగా హత్య చేసిన నిందితుడికి బాపట్ల 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు జీవిత ఖైదు విధించింది. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన పాగోలు కిరణ్‌చంద్ర తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైరయి పెన్షన్ పొందుతున్నారు. పెన్షన్ వచ్చిన ప్రతిసారి నిందితుడు డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడేవాడు. తల్లిదండ్రుల ఆస్తిని తనకు కాకుండా తన అక్కకు, ఆమె పిల్లలకు రాస్తారేమో అనే అనుమానంతో 2024 సంవత్సరం డిసెంబరు 14న కిరణ్‌చంద్ర తన తల్లిదండ్రులు పాగోలు విజయభాస్కర్ (74), పాగోలు వెంకటసాయికుమారి (71)ని రోకలిబండతో కొట్టి హత్యచేసి పారిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేల జరిమాన విధిస్తూ జడ్డి తీర్పునిచ్చారు.

నకిలీ పోలీసు అరెస్టు

● మహిళను మభ్యపెట్టి బంగారం కాజేసిన తీరు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సీసీఎస్ పోలీసునని చెప్పి మచిలీపట్నంలోని ఒక మహిళను మభ్యపెట్టి 90 గ్రాముల బంగారం కాజేసిన నిందితుడిని బుధవారం చిలకలపూడి పోలీసులు అరెస్టు చేశారు. చిలకలపూడి సీఐ నబీ వివరాల ప్రకారం, నరసరావుపేటకు చెందిన మేకల సాయికుమార్ మచిలీపట్నంలో ఓ మహిళను మభ్యపెట్టి 90 గ్రాముల బంగారం తీసుకున్నాడు. మహిళ ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు నిందితుడి కోసం గాలించారు. కాగా నిందితుడు సాయికుమార్ నరసరావుపేటకు చెందినవాడని తేలింది. గుంటూరు, రాజమండ్రి, ఏలూరులో మహిళలను బ్లాక్‌మెయిల్ చేసి బంగారం, నగదును తీసుకున్నట్టు అతడిపై పలు కేసులున్నాయి. నిందితుడు సాయికుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

తక్కెళ్ళపాడులో వివాహిత ఆత్మహత్య

పెదకాకాని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం శ్రీనివాస తండాకు చెందిన సిద్దు నాయక్, అతని భార్య జ్యోతి భాయ్ (26) జీవనోపాధి నిమిత్తం కొన్ని సంవత్సరాల క్రితం తక్కెళ్ళపాడు వచ్చారు. అక్కడ బ్రిక్స్ రాయి తయారుచేసే యూనిట్లో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో జ్యోతి భాయ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

రహదారుల నిర్మాణానికి పది కోట్ల నిధులు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గంలో అందమైన రహదారులు రూపుదిద్దుకోబోతున్నాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. సుమారు 10 కోట్ల రూపాయల నిధులు వీటికోసం మంజూరు చేసినట్లు తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కృతజ్ఞతలు తెలిపారు. కర్లపాలెం మండలం నాగరాజుపాలెం రహదారికి ఒక కోటి 78 లక్షలు, పొన్నూరు-చందోలు జడవల్లిని కలిపే రహదారి నిర్మాణానికి ఒక కోటి 47 లక్షలు, రేపల్లె ఖాజీపాలెం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొత్తపాలెం వయా పరిశావారిపాలెం రోడ్డుకు ఒక కోటి 27 లక్షలు, తారకరామ ఎస్టీకాలనీ నుంచి కర్లపాలెం ఎం.వి.రాజుపాలెం రోడ్డుకు ఒక కోటి 43 లక్షలు, గణపవరం ఆర్‌అండ్‌బి రోడ్డును కలుపుతూ కర్లపాలెం దండుబాటు రోడ్డుకు రూ.99 లక్షలు, పెదగొల్లపాలెం నుండి గణపవరం వయా నక్కలవారిపాలెం రోడ్డుకు రూ.60 లక్షలు, పెదపులుగువారిపాలెం ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి మర్రికట్ట జడ్పీ రోడ్డుకు రూ.42 లక్షలు, జాతీయ రహదారిని కలిపే కొండుభొట్లవారిపాలెం రోడ్డుకు రూ.11 లక్షలు, జాతీయ రహదారిని కలిపే సుబ్బారెడ్డిపాలెం రోడ్డుకు రూ.91 లక్షలు, నరసాయపాలెం నుంచి పైలబాట రోడ్డుకు రూ.52లక్షలు మంజూరైనట్లు వివరించారు. మొత్తంగా బాపట్ల నియోజకవర్గంలో 20 కిలోమీటర్ల మేర రహదార్లకు సుమారు 10 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు.

రైస్‌మిల్లులో ఆర్డీవో తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాపట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'కొనుగులు కొంతే' అని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. బాపట్ల మండలం ధరివాదకొత్తపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లును బుధవారం బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా తనిఖీ చేసి ధాన్యంను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైస్‌మిల్లులో ధాన్యం నిల్వ ఉంచే ప్రదేశాలలో సరైన ఏర్పాట్లు చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం సక్రమంగా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా పాల్గొన్నారు.



దరివాద కొత్తపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీవో గ్లోరియా

రేపు రక్షణ సేవ పెన్షనర్‌లకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఆర్.గుణషీలా

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రక్షణ సేవ పెన్షనర్‌లు, రక్షణ పౌరపెన్షనర్‌లు , కుటుంబ పెన్షనర్‌లకు సంబంధించిన ఫిర్యాదులు పరిష్కారం చేయబడుతుందని జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారిణి ఆర్.గుణషీలా అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 12న బాపట్ల కొత్త ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సీడీఏ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో సిస్టమ్ ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ రక్షస్పర్శ్ అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ సేవ పెన్షనర్‌లు, రక్షణ పౌరపెన్షన్‌లు, కుటుంబ పెన్షనర్‌లు సంబంధించిన ఫిర్యాదులు, ప్రశ్నలకు రక్షణ ఖాతాల విభాగం అధికారులు, సిబ్బంది హాజరై పరిష్కారం చేయబడుతుందన్నారు. తమ ఒరిజినల్ మిలిటరి డిశ్చార్జ్ సర్టిఫికెట్‌లను, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, పెన్షన్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, తమ కుటుంబ సభ్యుల వివరాలు, తమపెన్షన్‌కు లింక్ చేసిన మొబైల్ తీసుకొని రావాలని తెలిపారు. ఆయా అంశాలకు సంబంధించి ఏమైనా వివరాల కొరకు 0863-2225853, 8688817827 నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన అచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అంతర్‌కళాశాలల క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక పోటీలలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక, క్రీడలలో రెండు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లను సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో మొత్తం 19 కళాశాలలు పాల్గొన్న ఈ పోటీలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు బహుమతులను పొందారన్నారు. బాలికల క్రీడావిభాగంలో వాలీబాల్, షటిల్, టేబుల్ టెన్నీస్‌లలో ప్రథమ స్థానాన్ని, క్యారమ్స్‌లో ద్వితీయ స్థానాన్ని కైవశం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిట్స్ ఇన్‌ఛార్జి ఆఫీసర్ డాక్టర్ ఎం.శ్రీరేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిగా అబ్బులు



అబ్బులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిజన నాయకులు

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిగా నియమితులైన జి.అబ్బులును బుధవారం గిరిజన నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబరు, యానాది గిరిజన యూత్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కోమరగిరి వెంకటప్రసాద్, జిల్లా యానాది గిరిజన యూత్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గందళ్ళ నరేష్‌లు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

విద్యుత్ శాఖాధికారుల తనిఖీలు

పిట్టవానిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏకకాలంలో బాపట్ల విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ సర్వీస్‌లు తనిఖీ నిర్వహించారు. వివిధ మండలాల నుంచి 120 మంది విద్యుత్ సిబ్బంది పాల్గొని 5,127 సర్వీస్‌లు తనిఖీ నిర్వహించారు. అధికలోడ్ వాడుతున్న 50 మందికి రూ.1.58 లక్షల జరిమాన , కేటగిరి మార్పులో భాగంగా 12 సర్వీస్‌లను గుర్తించి రూ.2 లక్షల 58 వేల జరిమానా విధించినట్లు పిట్టలవానిపాలెం విద్యుత్ శాఖ ఏఈ అరీఫ్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీపీఈ ఎం.భాస్కరరావు, చెరుకుపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సురేష్‌బాబు, ఆయా మండల విద్యుత్‌శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ ప్రారంభం

పిట్టలవానిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకెఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి మూడు రోజులపాటు 48వ అచార్య నాగార్జున యూనివర్సిటి అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ స్త్రీ, పురుషుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్ తెలిపారు. ఈనెల 10, 11, 12 తేదీలలో 26 క్రీడాంశాలలో పురుషులు, స్త్రీలకు క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా ఉదయం 10కె రన్ ప్రారంభమైందని తెలిపారు. పోటీలను కళాశాల ఉపాధ్యక్షుడు మంతెన శివరామరాజు, కళాశాల జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ పాల్గొంటారని తెలిపారు.

పవన్‌కల్యాణ్ మాటామంతి కార్యక్రమానికి హాజరైన అధికారులు

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరి పీకే కన్వెన్షన్ హాలులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగస్తులతో మాటామంతీలో మండలంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ఓఎస్‌డీ ఎం.కృష్ణతేజ, కమిషనర్ శశిభూషణ్‌లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలస్థాయి అధికారులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసరావు, పద్మావతి, సూపరింటెండెంట్ రజనీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదపిల్లలకు నిత్యావసరాలు పంపిణీ

బాపట్లరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఉమ్మారెడ్డి సరోజినీదేవి కాలనీలో నివసిస్తున్న పేద పిల్లలకు డైలీ బ్రేడ్‌మిషన్స్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యవసర వస్తువులైన సబ్బులు, షాంపులు, కొబ్బరినూనె, పేస్ట్‌లు వంటివి పంపిణీ చేయటం జరిగిందని అధ్యక్షుడు జిడుగు రాజారత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుజన్, రాజాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం బాగుంటే అభివృద్ధి పట్టాలపై పయనిస్తుంది

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
● అధికారులు నిర్లిప్తంగా ఉండరాదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల నిర్మాణం బాగుంటే జిల్లా అభివృద్ధి పట్టాలపై పయనిస్తుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనులపై కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం, రహదార్లు మెరుగ్గా ఉంటే వెంటనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా జాతీయ రహదారుల నిర్మాణాలతో ప్రజల ప్రయాణాలు ఎంతో సులభంగా మారుతాయన్నారు. ఓడరేవు-పిడుగురాళ్ళ జాతీయ రహదారి 167ఎ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు-నిజాంపట్నం రహదారి నిర్మాణం, నిడుబ్రోలు-చందోలు ఆర్‌అండ్‌బి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కర్లపాలెం-గణవపరం రహదారి పనులు ప్రతివారం పురోగతిపై నివేదిక ఇవ్వాలన్నారు. రేపల్లె-నిజాంపట్నం ఆర్‌అండ్‌బి రహదారి నిర్మాణంపై వివరాలు ఇవ్వకపోవటంపై సంబంధిత డీఈని కలెక్టర్ నిలదీశారు. స్వదేశీ దర్శన్ కింద మంజూరైన ప్రాజెక్ట్‌లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్యలంకబీచ్‌లో నిర్మాణాలు వేగంగా చేపట్టాలన్నారు. హరితారిసార్ట్ భవనం ఆధునీకరణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. తుంగభద్ర కాల్వగట్టు బలోపేతం చేయాలన్నారు. రూ.4.58 కోట్లతో 16 వసతిగృహాల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారిణి జె.రాజాదెబోరా, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, అనుబంధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

పరిశుభ్రతలో జిల్లా ప్రథమస్థానంలో నిలవటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల ప్రచార ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్వాహణలో ఉత్తమ సేవలందించిన వారికి, క్లాప్‌మిత్రాలకు కలెక్టర్ సన్మానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్లు, తీరప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుంటే పర్యాటకులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆదాయ మార్గాలు పెరుగుతాయని, జిల్లా తలసరి ఆదాయం మెరుగుపడుతుందన్నారు. ప్రజా ఆరోగ్య దృష్ట్యా బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నవంబరు 19వ తేదిన నిర్వహించామని, అప్పటి నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు చేపట్టిన ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలు నేటితో ముగిశాయన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ శివన్నారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాంబాబు, విజయ్‌కుమార్, క్షేత్ర స్థాయి అధికారులుపాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు పెట్రోల్ సబ్సిడీ మంజూరు

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం, బాపట్ల జిల్లాలలో మూడు చక్రాల మోటారు వాహనాలు కలిగిన అర్హులైన దివ్యాంగులకు పెట్రోల్ సబ్సిడీ మంజూరైనట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్ సువర్త తెలిపారు. స్వయం ఉపాధి, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ రెట్రోఫిట్టింగ్ మూడు చక్రాల వాహనాలు కలిగి ఉన్న దివ్యాంగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి పెట్రోల్ సబ్సిడీ మంజూరు చేస్తున్నారని చెప్పారు. అర్హత గల వారు పెట్రోల్ సబ్సిడీ పొందేందుకు ఒంగోలు ప్రకాశం భవన్‌లోని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 08592-281310 నెంబరులో సంప్రదించాలన్నారు.

రొయ్యల పరిశ్రమలో మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల సంక్షేమం, భద్రత కొరకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రొయ్యల సినర్జీ ప్రాజెక్ట్‌లో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాల కొరకు మత్స్య, కార్మికశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ప్రచార యాత్ర వాహనాన్ని కలెక్టర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన గోడపత్రాలను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తీరప్రాంతంలో రొయ్యల పరిశ్రమలు అధికంగా ఉన్నందున వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ గాలిదేముడు, ఏడీ కృష్ణకిషోర్, డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ త్రినాద్‌రావు, సార్డ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, కార్మికశాఖ సహాయాధికారి సాయిజ్యోతి, రవిప్రదీప్, కళాకారులు పాల్గొన్నారు.



అవగాహన ప్రచారయాత్ర వాహనాన్ని జెండాఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ధాన్యం సక్రమంగా కొనుగోలు చేయాలి

కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, రెవెన్యూ, వ్యవసాయాధికారులకు దిశ, నిర్దేశం చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షాకీర్‌పాషా, వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయాధికారులు పాల్గొనగా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

చౌకధరల దుకాణంపై కేసు


కర్లపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న 12వ నెంబరు చౌకధరల దుకాణాన్ని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సీఎస్ఎల్ ఫణికుమార్ బుధవారం తనిఖీ చేశారు. రేషన్ బియ్యం ఉండాల్సిన దాని కన్న 260 కేజిలు తగ్గాయని దీంతో 6ఎ కేసు నమోదు చేసి షాపును సీజ్ చేశామని, వీఆర్వో సాంబయ్యకు షాపు బాధ్యతలు అప్పగించామని ఫణికుమార్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, ట్రాక్టర్ సీజ్

బాపట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక లారీ, ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం ధరివాదకొత్తపాలెం గ్రామసమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను, జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

మాస్టర్ ప్లాన్ పేరిట గందరగోళం సరికాదు

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్ ప్లాన్ పేరిట ప్రజలను గందరగోళానికి గురిచేయటం సరికాదని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ అమలు పర్చే ముందు వార్డు స్థాయిలో ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. సూర్యలంక సముద్రతీరంలో వ్యూ కనిపించకుండా దగ్గరగా పర్మినెంట్ రూమ్‌లు నిర్మించటం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, జోగి రాజా, ఎన్.వెంకట్రావు, జిఎ.మణిభూషణ్, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ చెంచయ్య, జికె.నాయుడు, కూనపరెడ్డి అవినాష్‌నాయుడు పాల్గొన్నారు.



వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న దాత రాజ్యలక్ష్మి

బాలురోన్నత పాఠశాలకు వ్యాయామ పరికరాలు వితరణ

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ బాలురోన్నత పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కొడాలి రాజ్యలక్ష్మి వ్యాయామ పరికరాలను వితరణగా అందజేశారు. కొల్లూరులోని జడ్పీ హెచ్‌ఎస్ క్రీడా మైదానంలో విద్యార్థుల వ్యాయామం కోసం అవసరమైన పరికరాలను రూ.15 వేలతో కొనుగోలు చేసి అందించిన ఆయా పరికరాలను విశ్రాంత హెచ్‌ఎం దంపతులు బుధవారం ప్రారంభించారు. హెచ్‌ఎం రజనీకాంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ, సిబ్బంది దాతలను సత్కరించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. స్థానిక సమావేశ కార్యాలయంలో ఎంపీపీ లలితకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశానికి మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

విలువలతో కూడిన రాజకీయ నాయకుడు డాక్టర్ వీరయ్య

అమృతలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన రాజకీయ నాయకుడు దివంగత డాక్టర్ కొడాలి వీరయ్య అని సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే కొడాలి వీరయ్య 25వ వర్థంతి పురస్కరించుకుని మండల పరిధిలోని వామనగుంటపాలెంలో బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొడాలి వీరయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వాసిరెడ్డి ప్రియబాంధవి మాట్లాడుతూ దానం అనేది విచక్షణతో కూడినది అయి ఉండాలని ఆ సిద్ధాంతంతోనే తమ తాతయ్య నడిచారని, ఆ దిశగానే తన కుటుంబ సభ్యులను కూడా పెంచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వీరయ్య సేవా సమితి ఆధ్వర్యంలో మోపర్రు పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, మోపర్రు ఎంపీటీసీ కొడాలి సుబ్బారావు, చవాకులు రామవరావు, వైద్యాధి కారి ముజీర్ షరీఫ్, కోగంటి సుభాష్, గాంధీ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ

రేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాలకు అండగా ఉండేందుకు సిఫార్స్‌సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఏపీ కమ్మవెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కుదరవల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బొబ్బర్లంక, సింగుపాలెం, గ్రామాల్లో తుఫాన్‌ప్రభావంతో నష్టపోయిన 80 గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువల చేసే నిత్యవసర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. సిఫార్స్ సంస్థ డైరెక్టర్ కొమరబత్తుని రవిప్రదీప్ మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని పేద ప్రజలకు అండగా నిలుస్తూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొమరగిరి నాగేశ్వరరావు, ఎన్.నాగరాజు, కె.శివరామకృష్ణ, వీర్రాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడేందుకు కృషి చేయాలి

రేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ సమాజంలో స్వేచ్ఛా సమానత్వం, న్యాయభావ ప్రకటన చేసే విధంగా మానవులు ఎదగాలని రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు ఎన్.సుభాషిణి అన్నారు. స్థానిక ఏబీఆర్ డిగ్రీకళాశాలలో బుధవారం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మానవహక్కులపై అవగాహన పెంపొందించుకుని తమ భవిష్యత్తు నిర్మాణంలో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసయ్య, ఆంగ్ల అధ్యాపకులు కె.బాలగురవయ్య, విద్యార్థులు కుమారి, అక్షిత, దత్తశ్రీవిష్ణువు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

రేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు ఏదొక క్రీడారంగాన్ని ఎంచుకుని వాటిల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏపీటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం అన్నారు. ఏపీట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్లో విద్యార్థులకు ఏపీటీఎఫ్, వాకర్స్ క్లబ్ సంయుక్త సౌజన్యంతో బుధవారం వ్యాయామ దుస్తులను అందించారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేయటం సామాజిక స్ఫూర్తిలో భాగమన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనరసింహ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, హరిప్రసాద్, జే.సుబ్బారావు, జవహర్ కుమార్, కె.శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

చెరుకుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన కావూరు వినయాశ్రమం వద్ద గల కట్టమీద నివశిస్తున్న గిరిజనులకు ఎస్‌ఎఫ్‌ఐఆర్‌డీ సంస్థ వెయ్యి రూపాయల విలువగల వస్తువులను 20 కుటుంబాలకు కావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మండల తాతాజీ చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవి ప్రదీప్, ఎస్టీ సెల్ నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఆయుష్ శాఖ మంత్రిని కలిసి ఎంపీ తెన్నేటి



కేంద్ర ఆయుష్‌శాఖా మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌జీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్ బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ జీతో సమావేశమయ్యారు. బాపట్ల నియోజకవర్గానికి సంబంధించి వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బాపట్లలో ఒక ప్రాంతీయ శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలని కోరటం జరిగిందన్నారు. దీని ద్వారా ఆయుష్ విధానాలపై విస్తృతమైన శిక్షణ అందించటానికి, ఈప్రాంతంలో ఆయుష్ వైద్యవిద్యను బలోపేతం చేయటానికి అవకాశం లభిస్తుందని తెలిపారు. జిల్లా ప్రజలకు యోగా, సంప్రదాయ ఆయుష్ చికిత్సలను అందుబాటులోకి తీసుకురావటానికి ఒక జిల్లా యోగా, ఆయుష్ వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేయాలని అభ్యర్థించటం జరిగిందన్నారు. ఈ రెండు విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ జీ సానుకూలంగా స్పందించారని, వాటి పరిశీలన, మంజూరుకు కృషి చేస్తానని హామీనివ్వటం జరిగిందని ఎంపీ తెలిపారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల ఆరోగ్యపరిరక్షణకు కేంద్రం నుంచి మరిన్ని నిధులు, సంస్థలను తీసుకురావటానికి కృషి చేస్తానని ఎంపీ అన్నారు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదు : కమిషనర్



ప్లాస్టిక్ కవర్లను వాడరాదని సూచనలు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ పరిధిలో వ్యాపారస్తులు, దుకాణదారులు, చిరువ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడరాదని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో చిరువ్యాపారుల వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను అమ్మవద్దని బుధవారం ఆదేశాలు జారీ చేశారు. వారి వద్ద ఉన్న కవర్లను స్వాధీనం చేసుకున్నారు. రెండోసారి కవర్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన వద్దు

● సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్



మాట్లాడుతున్న డాక్టర్ జరీనా పర్వీన్

వేమూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధిని గుర్తించిన వెంటనే తగిన చికిత్సతో నయం చేసుకోవచ్చునని వేమూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ అన్నారు. ఆసుపత్రిలో బుధవారం వైద్య సిబ్బందికి స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ, నల్లి లాంటి సంబంధిత పురుగు కుట్టినట్లయితే ఈ వ్యాధి సోకుతుందన్నారు. డెంగీ జ్వరం మాదిరిగానే ఒళ్లునొప్పులు, జీర్ణ సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి, వాంతులు, వికారం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో డాక్టర్ ఫాతిమా, డాక్టర్ రాధిక, డాక్టర్ భరత్, డాక్టర్ అనిల్ ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంట అవశేషాలను కాల్చవద్దు : ఏవో

చెరుకుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట కోతల అనంతరం వాటి అవశేషాలను కాల్చడం వల్ల కోత కోయని పక్క పొలాలు దెబ్బతినడమే కాకుండా వాతావరణం కలుషితమవుతుందని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూక్ అన్నారు. చెరుకుపల్లి, గుళ్ళపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది పోషకాల లభ్యత పెరుగుతుందన్నారు. రైతులు పంట అవశేషాలను తగలు పెట్టకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బీడీ రామకృష్ణ, వీఏఏ కవిత, రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు అనువైన నేలను సిద్ధం చేయాలి

● ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ అచ్యుతరాజు

నగరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : సారవంతమైన నేలను సిద్ధం చేయడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని బాపట్ల ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ అచ్యుతరాజు అన్నారు. బోరమాదిగపల్లి రైతుసేవాకేంద్రంపరిధిలో నేల ఆరోగ్యం, సారవంతమైన నేల గురించి బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధికనికర ఆదాయాన్ని పొందటానికి నేల ఆరోగ్యపరిరక్షణ చేసుకోవాలని సూచించారు. రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మీ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించి నేలఆరోగ్యాన్ని తెలుసుకుని సరైన యాజమాన్యం పాటించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వి.రమేష్‌బాబు మాట్లాడుతూ పంటల అవశేషాలను నేలలో కలియదున్నటం వలన భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కె.నాగశ్రీనివాసరావు, కేఎస్‌వీవీ ప్రసాద్, వ్యవసాయ సహాయకుడు పి.చైతన్య, బెల్లంవారిపాలెం సర్పంచ్ పి.శివరాంబాబు, పార్టీనాయకులు కారంకి సుబ్బారావు, గ్రామరైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ అచ్యుతరాజు

అధునాతన విద్య అందిస్తున్న ఎస్‌వీఆర్‌ఎం కళాశాల

● సెక్రటరీ బుచ్చయ్యచౌదరి



విద్యార్థులతో వల్లభనేనిబుచ్చయ్యచౌదరి, అధ్యాపకులు

నగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినీ, విద్యార్థులు డిఫెన్స్ అకాడమిని సద్వినియోగపరుచుకోవడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు దొరుకుతాయని నగరం ఎస్‌వీఆర్‌ఎం కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. డిఫెన్స్ విద్యార్థులకు బుధవారం దుస్తులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో ఉంటూ కృషి, పట్టుదల, అంకితభావంతో విద్యార్థులు ఫిజికల్‌గా సామాజిక దృక్పథంతో అభివృద్ధి చెందాలని ఈ అకాడమీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో విద్యార్థులకు ఫిజికల్ ట్రైనింగ్ అర్థమేటిక్ రీజనింగ్ ద్వారా మంచి జాబ్ ఆఫర్స్ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంటర్మీడియట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాయుడురెడ్డి, సూపరింటెండెంట్ పి.అమరేష్‌రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి, వి.సుబ్రహ్మణ్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ఐకాన్‌గా డ్రోన్లు

● నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతికత

● డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసు సిబ్బందికి శిక్షణ

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒక పక్క టెక్నాలజీ పరంగా ముందుకు వెళుతూనే మరో పక్క నేరస్థుల కదలికలతో పాటు అక్రమ రవాణ వంటి పలు అసాంఘిక కార్యకలాపాలను పసిగట్టేందుకు డ్రోన్ టెక్నాలజీ పోలీసులకు బ్రహ్మాస్త్రంగా దొరికింది. మనుషులు వెళ్ళలేని స్థావరాలకు కూడా డ్రోన్‌లను పంపుతూ చిమ చిటుక్కు మన్నా తెలుసుకునే ప్రయత్నాన్ని పోలీసులు మొదలు పెట్టారు. జిల్లాలో ఇప్పటికే డ్రోన్‌ల సాయంతో చాలా విషయాలలో సత్ఫలితాలు పొందారు.

● ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒకరికి శిక్షణ

డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు సిబ్బందికే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌కు డ్రోన్ ఆపరేటింగ్‌పై అవగాహన కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. వినాయకుని నిమజ్జన వేడుకలతో పాటు పలు ప్రాంతాలలో జరిగే జాతర్లలో అల్లరి మూకలను గుర్తించి వారి భరతం పట్టేందుకు డ్రోన్ పోలీసులకు మూడో కన్నుగా ఉపయోగ పడుతోంది. అంతే కాకుండా గంజాయి, గ్రావెల్ వంటి అక్రమ రవాణాను కూడా గుర్తించేందుకు ఇవి ఎంత గానో ఉపయోగ పడుతున్నాయి.

● డ్రోన్ ప్రభావంతో తగ్గుతున్న నేరాలు...



- కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

డ్రోన్ కెమెరాల వల్ల జిల్లాలో నేరాలను నియంత్రించ గలుగుతున్నాం. ప్రతి జిల్లాలో ఐదు లేదా ఆరు డ్రోన్ కెమెరాలు పోలీసు శాఖకు సమకూర్చాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటాన్ని అరికట్టటంలోనూ, మారుమూల ప్రదేశాల్లో జూదం, వ్యభిచార కేంద్రాల నిర్వహణ వంటి అసాంఘిక కార్యకలాపాలను డ్రోన్ కెమెరాలతో పసిగట్టి అరికట్టేందుకు చర్యలు చేపట్టాం.







జిల్లాలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో జనాలు అల్లాడిపోతున్నారు. పెరిగిన చలితో ముఖ్యంగా పిల్లల్లో, వృద్ధుల్లో ఆనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. సరైన ఆహారం, చిన్నపాటి జాగ్రత్తలు వహిస్తే వ్యాధుల నుంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలం.. అప్రమత్తం

● గతంలో కంటే పెరిగిన చలి తీవ్రత

● పెద్దలలో పెరుగుతున్న కీళ్ల నొప్పులు

● శీతాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు సోకే ప్రమాదం

● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది జనవరిలో కూడా నమోదు కాని కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ ఏడాది డిసెంబరులోనే నమోదవుతున్నాయి. పెరిగిన చలి తీవ్రతతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయి. జలుబు, దగ్గు, ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు వంటి సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో పిల్లలపై సుక్ష్మక్రిములు దాడి చేస్తుంటాయని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వారు తినే ఆహారం, దుస్తులు, ఆడుకునే బొమ్మలు, చదువుకునే ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. చలి, తగలకుండా వెచ్చదనం ఉండేలా దుస్తులను వేయాలని, మంకీ క్యాప్‌లు, ప్యాంట్లు, ఫుల్ హ్యాండ్స్ చొక్కాలు వినియోగించాలని సూచిస్తున్నారు. పిల్లలకు విటమిన్ సి, ఐరన్, జింక్ ఉన్న ఆహారాన్ని అందించాలని, పండ్లు, పాలు, ఆకుకూరలును ఎక్కువగా ఇవ్వాలని చెబుతున్నారు. కూరగాయలు, గోధములు, నాటు గుడ్లు ఆహారంలో చేర్చాలని అంటున్నారు. ఈ కాలంలో పిల్లలకు నీటిని బాగా తాగించాలని, వారు రోజులకు 12 గంటలు నిద్రపోయేలా చూడాలని చెబుతున్నారు. శీతాకాలంలో పిల్లలు బయటకు వెళ్లి ఆడుకునేలా ప్రోత్సహించాలని, అప్పుడే వారి శరీరానికి విటమిన్ డి అందుతుందని వైద్యులు చెబుతున్నారు.

● టీకాలు వేయించాలి

ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, నియంత్రిస్తుందని, వీటిని ఏడాది పిల్లలకు రెండు సార్లు, ఆ తరువాత ఐదేళ్ల వరకు ఏటేటా ఒక్కొక్కటి చొప్పున వేయాలని వైద్యుల సూచిస్తున్నారు. చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాదులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సమయంలో సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

● పెద్దలపై కీళ్ల ఒత్తిడి

చలి పెరిగే కొద్ది వాతవారణ పీడనం తగ్గిపోతుందని, ఈ ఒత్తిడితో పెద్దలలో కీళ్ల చుట్టూ ఉన్న కండరాలు, లిగ్మెంట్లు కొద్దిగా ఉబ్బుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. దీని కారణంగా కీళ్లపై ఒత్తిడి పెరిగి నొప్పులు వస్తాయని, అర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్న వారికి ఈ నొప్పి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. పెరిగిన చలితో మైగ్రేన్లు, రుమటాయిడ్ అర్థరైటిస్, ఫైబ్రో మైయాల్జియా, న్యూరోపతిక్, ఆస్టియా అర్థరైటిస్ వస్తాయని, ఈ సమయంలో వైద్యులు సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి

చలికాలంలో వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి. మంచి ఆరోగ్యం, నిద్ర, వ్యాయమం తప్పనసరి. విటమిన్ సి ఉన్న పండ్లు పిల్లలు తినేలా చూడాలి. శీతాకాలంలో సర్వసాధారణంగా వచ్చే ఆనారోగ్యాలు దగ్గు, తుమ్ములు, జలుబు, చర్మం పగలడం వంటివి చూడ్డానికి చిన్నవిగా కనిపిస్తాయి. నిర్లక్ష్యంగా ఉంటే అవే పెద్దవిగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో బ్యాక్టీరియా, వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది. చిన్న పాటి సమస్య అయినా వైద్యులను సంప్రదించాలి. జీజీహెచ్‌లో అన్ని సమయాల్లోనూ వైద్యులు అందుబాటులో ఉంటారు.

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ



అంథోని థామస్ చర్చి వేడుకల్లో గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ప్రతి హృదయం పవిత్రంగా ఉండాలి

● బిషప్ డాక్టర్ సీహెచ్ భాగ్యయ్య

రెంటచింతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి హృదయం పవిత్రంగా ఉండాలని, స్వార్థరహిత జీవనం గడపాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి (బిషప్) డాక్టర్ చిన్నబత్తిని భాగయ్య కోరారు. బుధవారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో పునీత థామస్ చర్చి 125వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి స్థానిక విచారణ గురువు హెచ్‌జీఎన్ పవిత్రన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాక ముందు నిర్మించిన ఈ చర్చిని రూ.40లక్షలతో ఆధునీకరించిన తీరు చూడముచ్చటగా ఉందని కొనియాడారు. అనంతరం సమష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎలీషా రాజ్, మర్రి అనిల్, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసైన్డ్‌పై కొరడా

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తెప్పిం చుకుంది. దీనితో పాటు వీటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ వరకు వెళ్లాయనే అంశంతో పాటు, తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలేమిటనే రిపోర్టులు కూడా గతంలోనే ప్రభుత్వం చేతికి అందాయి. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో నెలలోగా నిర్ణయం తీసుకుని, భూ సంబంధిత సమస్యల పరిష్కారం నిర్దిష్ట కాలపరిమితితో జరగాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝుళిపించడంతో పాటు, అందకు బాధ్యులైన వారిపై కూడా చర్యలకు దిగనున్నామనే సంకేతాలను ప్రభుత్వం స్పష్టంగా పంపింది.

పదికి.. వంద రోజుల ప్రణాళిక

● మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు

● ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ

● సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం




గుంటూరు(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. పదిలో రాష్ట్రస్థాయిలో తమ తమ జిల్లాలను అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యంగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 60వేల మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గతేడాది ఉమ్మడి జిల్లాలో గుంటూరు రాష్ట్రస్థాయిలో టాప్ పదిలో ఉండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు కొద్దిలో వెనుకబడ్డాయి. ఈ నేపథ్యంలో ఈఏడాది ఆయా జిల్లాల్లో కూడా మెరుగైన ఫలితాల కోసం కృషిచేస్తున్నారు.

● సిలబస్ పూర్తి..

ప్రతిరోజు రివిజన్ తరగతులు

పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తయింది. ఇక నుంచి ప్రతిరోజు స్టడీ అవర్స్ పకడ్బందీగా నిర్వహించడంతోపాటు సబ్జెక్టుల వారీగా అం దులోని పా ఠ్యాంశాలను ఉపాధ్యాయు లు రివిజన్ చేయనున్నారు. ప్రతి రోజు ఉదయం గంట, సాయంత్రం గంటపాటు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించనున్నారు. విద్యార్థులు పాఠశాల పరీక్షల్లో తెచ్చుకున్న మార్కులను విశ్లేషించి స్టడీ అవర్స్ నిర్వహిస్తారు విద్యార్థులను గ్రూపులుగా విభజించి రివిజన్ క్లాసులు నిర్వహిస్తారు. అంతేకాకుండా వారాంతాల్లో సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల మార్కులను బేరీజు వేయనున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నవారికి ఇంకా మెరుగైన శిక్షణ అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాలను సేకరించి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



● త్వరలో స్టడీ మెటీరియల్ పంపిణీ

జిల్లా పరిషత్ నుంచి త్వరలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నారు. ఈ మెటీరియల్ కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. త్వరలో 10వ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం అల్పాహారం అందించేం దుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల స్టడీ అవర్స్‌ను నిత్యం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విద్యాధికా రులు ఇందుకోసం ప్రత్యేక షెడ్యూలును నిర్దేశించుకొని పాఠశాలలను సం దర్శించి స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించనున్నారు. ఇలా వందరోజుల ప్రణాళిక రూపొందించి పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు.



కొల్లిపర మార్కెట్‌లో వేలం పాటకు వచ్చిన కర్పూర గెలలు

ప్రియమైన అరటి

● గెల రూ. 600 నుంచి రూ 750 పలుకుతున్న వైనం

● పోటీపడి కొంటున్న వ్యాపారస్థులు

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబరులో కురిసిన పెనుగాలులతో కూడిన వర్షాలు అరటి ధరను అమాంతం పెంచేశాయి. ఎన్నడూ లేని విధంగా అరటి గెలల ధరలు పలుకుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌కు సీజన్‌లో ప్రతి రోజూ సుమారు 5 వేల నుంచి 6 వేల వరకు అరటి గెలల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది అక్టోబరు నెలలో పెనుగాలులతో కూడిన వర్షం పడటంతో అరటి తోటలు పాడై ఉత్పత్తి తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌కు రోజుకు 200 నుంచి 350కి మించి గెలలూ రావడం లేదు. దాంతో ధరలు చుక్కలనంటుతున్నాయి.

● పోటీపడి కొంటున్న వ్యాపారస్థులు

అరటి ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌కు గెలలు అతి తక్కువగా వస్తున్నాయి. దాంతో వ్యాపారస్థులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. గతంలో మొదటి రకం కర్పూర అరటి గెల ధరరూ.150 నుంచి రూ.200 వరకు పలకగా, రెండో రకం రూ 90.నుంచి రూ.150 వరకూ పలికేది. చక్కెరకేళి రూ.100 నుంచి 150 పలికేది. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.600 నుంచి నుంచి రూ.750 వరకు, రెండో రకం రూ.450 నుంచి రూ.550 ధరలు పలుకుతున్నాయి. చక్కెరకేళి మొదటి రకం రూ.400 నుంచి రూ.450 వరకు, రెండో రకం రూ.250 నుంచి రూ.350 వరకు పలుకుతున్నాయి.

● పంట ఉన్నప్పుడు లేని ధర

ఈ సంవత్సరం రైతుల దగ్గర పంట ఉన్న సమయంలో అరటి గెలలకు ధరలు లేకపోవడంతో పూర్తిగా నష్టపోయారు. తమ పంటలు పాడై ఉన్న సమయంలో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పెరగాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వ్యాపారులు ఇదే అదునుగా డజను అరటి కాయలను రూ.50 నుంచి రూ.60 వరకు, చక్కెరకేళి రూ.100 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. దాంతో వినియోగదారులు అరటి పండ్లను కొనాలంటేనే భయపడుతున్నారు.

అజ్ఞాతంలో భోక్తలు

(7వ పేజీ తరువాయి)

భావించిన వారు పది రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో 11వ నిందితుడైన నాటి డైరెక్టర్ కూనిశెట్టి శివ నవీన్ ఇప్పటికే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాముతో పాటు మిగిలిన నిందితులు కూడా ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

అక్రమాలు ఇలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాతంశెట్టి సీతారామాంజనేయులు 2019 డిసెంబరు 5 నుంచి 2021 ఫిబ్రవరి 13 వరకు, 2021 జూలై 24 నుంచి 2024 జూన్ 7 వరకు రెండు విడతలుగా జీడీసీసీబీ చైర్మన్‌గా కొనసాగారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా బోగస్ రుణాల మంజూరు సాగింది. రాము చైర్మన్ కాకముందు మిర్చి టిక్కీకి 1500 తాకట్టు రుణంగా పరిమితి రూ.10 లక్షలు ఉండేది. అయితే ఆయన చైర్మన్ అయిన తర్వాత టిక్కీకి తాకట్టు రుణాన్ని 1500 నుంచి 2000కు, ఆ తర్వాత 4 వేలకు పెంచేశారు. అంతేకాక రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా విశ్రాంత ఉద్యోగి యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్‌ను చిల్లీస్ స్టాక్ క్వాలిటీ కంట్రోలర్ అండ్ వాల్యూవర్‌గా నియమించుకున్నారు. బోగస్ రైతుల పేరుతో, స్టాక్ లేకపోయినా కోల్డ్ స్టోరేజ్ యజమానులకు ఈశ్వర్‌ప్రసాద్ 2023లో 1347 మందికి తాకట్టు అప్రైజర్ సర్టిఫికెట్లు జారీ చేసి రూ.కోట్లలో రుణాలు నొక్కేశారు. నాటి నల్లపాడు బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి 2 దఫాలు అక్కడే మేనేజర్‌గా పనిచేయడమే కాకుండా రెండేళ్లలోనే రెండుసార్లు ఉద్యోగోన్నతి పొందడం వెనుక ఇక్కడ జరిగిన కుంభకోణానికి సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈమె మేనేజర్‌గా ఉన్న సమయంలో బినామీ వ్యక్తుల పేర్లతో కోల్డ్ స్టోరేజ్ యజమానులు బ్యాంకుకు రాకుండానే వారి సిబ్బందిని పంపి ఎస్‌బీ ఖాతాలు తెరిచారు. రెండు లక్షలకు పైబడిన రుణాలను తప్పనిసరిగా బ్రాంచ్ నుంచి ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఖాతాలకు బదిలీ చేయాలి, కానీ నిబంధనల విరుద్ధంగా బ్యాంకులోనే విత్ డ్రా చేశారు. మిర్చిపై తాకట్టు రుణం తీసుకున్న గడువు ముగిసినా స్టాక్ వేలానికి చర్యలు తీసుకోలేదు. నాటి చైర్మన్ రాముతో పాటు నల్లపాడు బ్రాంచ్ మేనేజర్, నాటి సీఈవో, బ్యాంకు డైరెక్టర్లు, అప్రైజర్ అందరూ కుమ్మక్కై 22 కోట్ల 25 లక్షల 5 వేల 439 రూపాయల బోగస్ రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేశారని అధికారుల విచారణలో తేల్చారు.

● లింగాయపాలెంలోని విశ్వసాయి ఫుడ్స్‌పేరుతో 12 కోల్డ్ స్టోరేజీలలో మిర్చిస్టాక్ ఉన్నట్లు బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు.

● అంకిరెడ్డిపాలెంలోని రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో మిర్చిస్టాక్ లేకపోయినా రూ.13కోట్ల 15లక్షల 7వేల 453 బోగస్ రుణాలు పొందారు.

● నకిలీ డ్వాక్రా గ్రూపులు సృష్టించి వ్యక్తిగత, దీర్ఘకాలిక రుణాలు సుమారు 9 కోట్ల వరకు తీసుకున్నారు.

● వెంగళాయపాలేనికి చెందిన హోసన్నా మహిళ గ్రూప్ బోగస్ అని డీఆర్డీఏ నిర్ధారించినా రూ.14 లక్షలు రుణాలు ఇవ్వాల్సిందిగా నాటి మేనేజర్ అరుణ్‌కుమారి సిఫార్సు చేశారు.

● సంగడిగుంటకు చెందిన వీరబ్రహ్మేంద్ర మహిళా పొదుపు సంఘానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని ఆమె సిఫారసు చేశారు. అయితే అప్పటికే ఆ గ్రూప్ పేరుతో మరో బ్యాంకులో రూ.8.19 లక్షల రుణం బకాయి ఉంది.

● ఎటువంటి భూములు లేకపోయినా తప్పుడు పత్రాలు సృష్టించి 2021లో కొందరు రూ.9 కోట్లు రుణాలు తీసుకున్నారు. దీనిపై అప్పట్లో నల్లపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాగా ఆ కేసు విచారణను ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆయన కేసు విచారించి బ్యాంక్ మేనేజర్, మాజీ తహసీల్దార్ సహా ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు.

ఇప్పటికే రాముపై భూకబ్జా ఫిర్యాదు

లాల్‌పురంలో తాను 2011లో డీ నెంబర్ 324/ఎ లో 13 శెంట్ల భూమి కొనుగోలు చేసిన స్థలాన్ని రాము కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగొట్టాడని పట్టాభిపురానికి చెందిన ఉప్పు శంకరరావు రెండు రోజుల క్రితం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని కబ్జా చేసి గోడ కడుతుండగా పెద్దమనుషులను పంపి ప్రాధేయ పడితే దూషించడమే కాక దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడన్నారు. దీనిపై విచారించాల్సిందిగా ఎస్పీ నల్లపాడు పోలీసులను ఆదేశించారు.

ఆమె బతికున్నా...!

● అన్నదాత సుఖీభవ అధికారుల అలసత్వం

మేడికొండూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతు బతికున్నా, రికార్డులలో ఆమెను చంపేశారు. అధికారుల తప్పిదం ఆ మహిళకు శాపంగా మారింది. అన్నదాత సుఖీభవ అధికారుల అలసత్వం కారణంగా ఆమెకు దక్కాల్సిన పీఎం కిసాన్ పరిహారం చేజారింది. మేడికొండూరు మండలం భీమినేని వారిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు మద్దినేని రాధారాణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' పరిహారం జమ కాలేదు. దీంతో విషయం తెలుసుకుందామని ఆమె బుధవారం గ్రామంలోని అన్నదాత సుఖీభవ కేంద్రానికి వెళ్లింది. అక్కడి సిబ్బందిని తన స్టేటస్ చెక్ చేయమని కోరింది. కంప్యూటర్‌లో వివరాలు పరిశీలించిన సిబ్బంది ఒక్కసారిగా నీళ్ల నమిలారు. సిబ్బంది చూపించిన వివరాల ప్రకారం రాధారాణి మరణించినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదై ఉండడంతో రాధారాణి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన పేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అందకుండా పోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు, ఇలా ఇష్టారాజ్యంగా రికార్డులు ఎలా మారుస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రాధారాణి రికార్డులను సరిచేసి, ఆమెకు రావాల్సిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పరిహారం అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులకు మహర్దశ

(7వ పేజీ తరువాయి)



పిడుగురాళ్లలో అభివృద్ధి చేయనున్న చెరువు

సర్వే చేయించి చెరువుల వాస్తవిక స్థలా న్ని నిర్ధారించారు. నరసరావుపేట మున్సిపాలిటీలో అభివృద్ధి చేసే కత్తవ చెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయా జిల్లాల్లో గుర్తించిన ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సంబంధింత పనుల టెండర్ 23వ తేదీ గడువుగా ప్రకటించారు. టెండర్ల అనంతరం పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

మునిసిపాల్టీల వారీగా నిధుల మంజూరు ఇలా..

మునిసిపాల్టీల	చెరువులు	నిధులు రూ.కోట్లలో
నరసరావుపేట	1	5.60
చిలకలూరిపేట	5	3.68
మాచర్ల	1	6.60
పిడుగురాళ్ల	1	11.52
సత్తెనపల్లి	1	0.72
దాచేపల్లి	2	2.50
గురజాల	2	2.10
చీరాల	2	3.05
బాపట్ల	1	1.94
రేపల్లె	3	4.10
అద్దంకి	1	5.10
గుంటూరు	2	17.80
మంగళగిరి.. తాడేపల్లి	7	11.70
పొన్నూరు	1	3.04
తెనాలి	2	10.34

ముగిసిన యువజనోత్సవం

● మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థులతో డాన్సు చేస్తున్న మాస్టర్ పండు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యువజనోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన సాంస్కృతిక పోటీలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న ఉత్సాహాన్ని చూసి తన కళాశాల రోజులను గుర్తు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలు త్వరలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల యువజనోత్సవం పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మూడు రోజుల నివేదికను అందజేశారు.

● ఓవరాల్ చాంపియన్‌షిప్ జేకేసీ కైవసం

యువజనోత్సవంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతిని జేకేసీ కళాశాల కైవసం చేసుకుంది. రన్నర్‌గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల నిలిచింది. నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, జానపద కళారూపాలు, నాటకాలు, చిత్రలేఖనం, క్విజ్ విభాగాల్లో విజేతలకు ప్రత్యేక అతిథిగా విచ్చేసిన రియాలిటీ షో ఢీ డ్యాన్సర్ పండు మాస్టర్, ముఖ్యఅతిథి వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు, విశిష్ట అతిథులు వర్సిటీ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిసాస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు బహుమతులు అందజేశారు.

● అలరించిన పండు మాస్టర్ డ్యాన్స్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో నిరంతరం సాధన చేస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని డ్యాన్స్ మాస్టర్ పండు సూచించారు. విద్యార్థులు కళాశాల రోజులను సద్వినియోగం చేసుకోవాలని, మంచి సువర్ణావకాశాన్ని కోల్పోవద్దన్నారు. తాను ఐటీ కళాశాలలో చదువుకున్నానని, డాన్స్, నటనపై మక్కువతో కళా రంగంలోకి ప్రవేశించానని చెప్పారు. అనంతరం ఇటుక మీద ఇటుక పెట్టి, నాది నెక్లెస్ గొలుసు పాటలకు పండు మాస్టర్ చేసిన డ్యాన్స్ విద్యార్థులను అలరించింది. ముగింపు ఉత్సవాల్లో ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్, పాలక మండల సభ్యుడు ఆచార్య కె.సుమంత్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఫార్మసి కళాశాలప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులు రూపొందించిన కళాకృతులు



ముగ్గు వేస్తున్న విద్యార్థిని



పర్చూరులోని ప్రధాన రోడ్డు పక్కన డ్రైనేజీలో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

- ముందుకు కదలని మురుగు
- అవస్థలు పడుతున్న పారిశుధ్య కార్మికులు

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నా అచరణకు నోచుకుంటున్న దాఖలాలు లేవు. రోజు రోజుకు ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడి కావటంతో సమస్య జటిలంగా మారింది. ప్లాస్టిక్ వాడకంతో ప్రజల ఆరోగ్యం మాట దేవుడికి ఎరుక పారిశుధ్య కార్మికులకు శాపంగా మారింది. అనునిత్యం పారిశుధ్య పనులు చేస్తున్నా ఎక్కడ సమస్య అక్కడే అన్న చందంగా ఉంది పరిస్థితి. దీంతో వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో పారవేయటంతో మురుగు ముందుకు కదలని విధంగా మారింది. ఎక్కడ చూసినా డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలే పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విధంగా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఇందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని ప్రజలు అంటున్నారు.



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంట అవశేషాలను తగులబెట్టకండి

- రైతులకు ఏవో సూచన

పంగులూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పొలాలలోని పంట అవశేషాలను కాల్చవద్దని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యాక్రమంలో పాల్గొన్న ఏవో మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చితే భూమి నాణ్యత దెబ్బతింటుందన్నారు. పంట అవశేషాలను కాల్చకుండా వాటిని మట్టిలో కలపాలని, కాల్చితే పర్యావరణ కాలుష్యం ఏర్పడటంతో పాటు నేలలోని ముఖ్యమైన పోషకాలు కోల్పోతాయని తెలిపారు. నేలలోని సేంద్రియ కార్బన్ తగ్గడంతో పాటు పంటకు ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు నాశనం అవడం, భూమి తేమనిలుపుకునే సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటసాగులో అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

ఆమోదగిరిపట్నం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో నెలకొన్న వివాదాలతో వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన చీరాల వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని ఆమోదగిరిపట్నం కేపాల్ కాలనీలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కాలనీకు చెందిన ఆసోది మహేశ్వరరెడ్డి(45) డైయింగ్ పని చేస్తుంటాడు. ఇతని భార్య, ఇరువురు కుమారులు సంతానం. అయితే ఇటీవల మద్యానికి బానిసగా మారిన ఇతను బుధవారం రాత్రి దుస్తులకు రంగులు అద్దే కెమికల్ తాగి బలవన్మరణం చెందాడు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.



విగతజీవిగా మహేశ్వరరెడ్డి

అసైన్డ్‌పై కొరడా

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తెప్పించుకుంది. దీనితో పాటు వీటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ వరకు వెళ్లాయనే అంశంతో పాటు, తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలేమిటనే రిపోర్టులు కూడా గతంలోనే ప్రభుత్వం చేతికి అందాయి. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో నెలలోగా నిర్ణయం తీసుకుని, భూ సంబంధిత సమస్యల పరిష్కారం నిర్దిష్ట కాలపరిమితితో జరగాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝుళిపించడంతో పాటు, అందకు బాధ్యులైన వారిపై కూడా చర్యలకు దిగనున్నామనే సంకేతాలను ప్రభుత్వం స్పష్టంగా పంపింది.

చెరువులకు మహర్దశ

(7వ పేజీ తరువాయి)

సర్వే చేయించి చెరువుల వాస్తవిక స్థలాన్ని నిర్ధారించారు. నరసరావుపేట మున్సిపాల్టీలో అభివృద్ధి చేసే కత్తవ చెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయా జిల్లాల్లో గుర్తించిన ఆక్రమణలను తొలగించేందకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సంబంధింత పనుల టెండర్ 23వ తేదీ గడువుగా ప్రకటించారు. టెండర్ల అనంతరం పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

బస్టాండు స్థలాన్ని పరిశీలించిన ఆర్‌ఎం

పెద్దదోర్నాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌టీసీ బస్టాండు స్థలాన్ని రీజనల్ మేనేజర్ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అర్‌టీసీ బస్టాండు నిర్మాణం కోసం హద్దులు పరిశీలించినట్లు చెప్పారు. 119,120 సర్వేనెంబరులో గల 94సెంట్లలో నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు మంజూరు అయ్యాయని తెలిపారు. అందుకుగానూ క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించామని, నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో

గంజాయి పట్టివేత

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి, గంజాయి చాకెట్లను తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సీసీఎస్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా చెన్నయ్‌కు చెందిన ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని గుర్తించి పట్టుకున్నారు. నిందితులు ఒడిశా నుంచి చెన్నయ్‌కి కిలో గంజాయి తీసుకొని ఒంగోలు వరకు రైలులో వచ్చారు. అయితే వారి వద్ద టిక్కెట్ లేకపోవడంతో రైల్వే టీసీ ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దించివేశాడు. దీంతో వారు ఇరువురు చెన్నయ్‌కు బస్సులో వెళ్ళాలని ఆర్టీసీ డిపోకు వచ్చి సీసీఎస్ పోలీసులకు దొరికిపోయారు. ఈ సందర్భంగా నిందితుల వద్ద నుంచి కిలో గంజాయి, గంజాయి చాక్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్‌లో అప్పగించారు. ఇరువురిని పోలీసులు విచారిస్తున్నారు.

చెన్నై టూ చీమకుర్తి

- రెండు ఆయిల్ ట్యాంకర్లు సీజ్
- ముగ్గురిపై కేసు నమోదు
- రూ.2.70 లక్షలు జీఎస్టీ ఎగవేత



అక్రమంగా తరలిస్తున్న ఆయిల్ ట్యాంకర్లను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ అయిల్‌ను డీజిల్‌గా విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ముఠా గుట్టును విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. బుధవారం చెన్నై నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇండస్ట్రియల్ ఆయిల్ రెండు ట్యాంకర్లను సీజ్ చేసి ముగ్గురిపై 6ఏ కేసుకు సిఫార్సు చేశారు. చెన్నై నుంచి అక్రమంగా తరలించి జీఎస్టీ రూ.2.70 లక్షలు చెల్లించకుండా ప్రభుత్వనికి గండి కొడుతున్నారు. ఈ మేరకు సంతనూతలపాడు సమీపంలో రెండు ట్యాంకర్లను నిలిపి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా ఈ బాగోతం బట్టబయలు అయింది.

ముగ్గురిపై కేసు నమోదు

ఒంగోలుకు చెందిన శ్రీనివాస ల్యూబ్స్ అండ్ ఆయిల్ ప్రోడక్ట్స్ యజమాని ఏల్చూరి శ్రీనివాసరావు, నారయణ, చెన్నై, తిరుమన్నమలై దివ్య ఇండస్ట్రీస్ రాజమణిలపై 6ఏ కేసు జ్యుడీషియల్ కోర్టులో ధాఖలు చేస్తున్నారు. జీఎస్టీ చెల్లించకుండా అక్రమరవాణా చేసినందుకు అధికారులు అయిల్ శాంపిల్స్ విశ్లేషణ కోసం నమూనాలు సేకరించారు. శాంపిల్స్ నివేదికలు అందిన తరువాత క్రిమినల్ చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐలు రాఘవరావు, రవిబాబు, డీసీటీవో రామారావు, ఎస్సై నాగేశ్వరావు, సివిల్ సప్లయిస్ ఏఎస్‌వో పుల్లయ్య సిబ్బంది ఉన్నారు.

ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను డీజిల్‌గా విక్రయాలు

డిజిల్ బదులుగా ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్

తక్కువ ధరకు దొరికే ఇండస్ట్రియల్ మిక్సిడ్ ఆయిల్‌ను డిజిల్ పేరుతో తక్కువ ధరకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నైకు చెందిన రాజమణి ఒంగోలులో ఉన్న శ్రీనివాస లూబ్రికెంట్స్ పేరుతో ఏల్చూరి శ్రీనివాసరావుకు ఇండస్ట్రియల్ మిక్సిడ్ ఆయిల్ ను పంపిస్తున్నారు. శ్రీనివాసరావు, చీమకుర్తిలో ఎర్లా నారయణ అనే ఏజెంటు ద్వార అక్కడ క్వారీలు, క్వారీలలో పనిచేసే వాహనాలు, టిప్పర్లకు డిజిల్ తక్కువ ధరకు వస్తుందని విక్రయిస్తున్నారు. చెన్నై నుంచి లీటరు రూ.70కు కొనుగోలు చేసి ఇక్కడ రూ.87 విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో దొరికే డిజిల్ కంటే తక్కువ ధర కావడంతో టిప్పర్ యజమానులు క్వారీ యజమానులు ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్నారు.

కోటి సంతకాల సేకరణ బూటకం

- వైసీపీ చీప్‌ట్రిక్స్ మానుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల పీపీపీ విదానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ఒట్టి బూటకమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ చీప్ ట్రిక్స్ మానుకుంటే బాగుంటుందని అన్నారు. బుధవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆయన విలేకరులతో మా ట్లాడారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిపై ఎందుకు కోటి సంతకాల సేకరణ చేపట్టలేదని ప్రశ్నించారు. రోడ్ల దుస్థితిపై కోటి సంతకాల సేకరణను జగన్ నిర్వహిం చినట్లయితే ప్రజాస్పందనతో అయినా బుద్ధి వచ్చేదన్నా రు. నేడు కోటిసంతకాల కార్యక్రమం విజయవంతం ర్యాలీలో పాల్గొన్న నేతలు వారి పాలనలో అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారో కూడా ప్రజలకు చెపాలన్నారు.

కనిగిరి అభివృద్ధికి పాటుపడని నేతలు ఈప్రాంతా నికి వచ్చిన ట్రిపుల్‌ఐటీ కళాశాల ఒంగోలు వెళ్తుంటే ఎందుకు ఆపలేకపోయారో ప్రజలకు సమాధానం చె ప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. నడికుడి రైల్వే మార్గం, బైపాస్, ఆసుపత్రి అభివృద్ధి, ఓవీ రోడ్డు వంటి ప్రజావసరాలను ఎందుకు గాలకొదిలేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసమస్యలు పరిష్కరించని నేతలు ఇప్పుడు తగదునమ్మా అంటూ కోటి సంతకాల సేకరణ చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజాప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యా ణ్ గ్రామీణాభివృద్ధి కోసం నిధులు కేటాయించారన్నారు. మంత్రి లోకేష్ పారిశ్రామికంగా రాష్ట్రాభివృద్ధికి అహర్ని శలు శ్రమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు వచ్చేందుకు ఆయన వయస్సుకు మించి విదేశాల్లో పర్యటిస్తూ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, కనిగిరి, హెచ్‌ఎంపాడు మండలాల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, సానికొమ్ముతిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), ముస్లిం మైనారిటీ నాయకుడు రోషన్ సంధాని, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, బాలు ఓబులురెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, గుడిపాటి ఖాదర్, షరీఫ్, కరణం అరుణమ్మ, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు?

- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నివేదికలు పంపిన అధికారులు



కొత్త పెద్దగుడిపాడు గ్రామ వ్యూ

దొనకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దొనకొం డ మండలంలో పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామా లు గంగదేవిపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతు న్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం గంగదేవిపల్లి పంచాయతీ పరిధిలో 3383 మంది జనాభా ఉండగా, 2541 మంది ఓటర్లు ఉన్నారు. గంగదేవిపల్లి గ్రామా నికి రోడ్డుమార్గాన పెద్దగుడిపాడు మూడు కిలోమీ టర్లు, దొండపాడు పదకొండు కిలోమీటర్లు దూరం లో ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే గ్రామసభలు, వివిద ప్రభుత్వ పథకాలు పొందేందుకు, దరఖాస్తులు చేసుకొను నిమిత్తం సచివాలయంకు వెళ్లేందుకు ఆరెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చివరకు రేషన్ బియ్యాన్ని పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల ప్రజలు గంగదేవిపల్లి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల విభజన, పంచాయతీల ఏర్పాటుచేయాలని ప్రభుత్వం యోచి స్తుంది. దీంతో పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి తాము పడుతున్న ఇబ్బందులను ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి ఏకరువుపెట్టారు. కొత్త పంచాయతీగా పెద్దగుడిపాడు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలంటూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె గంగదేవిపల్లి నుంచి పెద్దగు డిపాడు, దొండపాడు గ్రామా లను విభజించి కొత్త పంచా యతీగా పెద్దగుడిపాడు ఏర్పా టుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు కొత్త గా పెద్దగుడిపాడు పంచా యతీ ఏర్పాటుకు నివేదికలు పంపాలని ఆదేశించారు.

ఉన్నతాధికారులు నిర్దేశిం చిన సమాచారం మేరకు పెద్దగుడిపాడు, దొండపాడు గ్రామాల్లో జనాభా, ఓటర్లు, భౌగోళిక అంశాలతో పాటు పంచాయతీ తీర్మాణంతో పూర్తి నివేదికను ఇటీవల ఉన్నతాధికా రులకు పంపినట్లు సమాచారం. ఇప్పటివరకు మండలంలో 18 గ్రామ పంచాయ తీలు ఉన్నాయి. కొత్తగా 19వ పంచాయతీగా పెద్దగు డిపాడు ఏర్పాటవుతుందనే ఆశతో ఆయాగ్రామాల ప్రజలు ఉన్నారు.

అజ్ఞాతంలో భోక్తలు

(7వ పేజీ తరువాయి)

భావించిన వారు పది రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో 11వ నిందితుడైన నాటి డైరెక్టర్ కూనిశెట్టి శివ నవీన్ ఇప్పటికే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాముతో పాటు మిగిలిన నిందితులు కూడా ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

అక్రమాలు ఇలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాతంశెట్టి సీతారామాంజనేయులు 2019 డిసెంబరు 5 నుంచి 2021 ఫిబ్రవరి 13 వరకు, 2021 జులై 24 నుంచి 2024 జూన్ 7 వరకు రెండు విడతలుగా జీడీసీసీబీ చైర్మన్‌గా కొనసాగారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా బోగస్ రుణాల మంజూరు సాగింది. రాము చైర్మన్ కాకముందు మిర్చి టిక్కీకి 1500 తాకట్టు రుణంగా పరిమితి రూ.10 లక్షలు ఉండేది. అయితే ఆయన చైర్మన్ అయిన తర్వాత టిక్కీకి తాకట్టు రుణాన్ని 1500 నుంచి 2000కు, ఆ తర్వాత 4 వేలకు పెంచేశారు. అంతేకాక రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా విశ్రాంత ఉద్యోగి యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్‌ను చీఫ్ స్టాక్ క్వాలిటీ కంట్రోలర్ అండ్ వాల్యూవర్‌గా నియమించుకున్నారు. బోగస్ రైతుల పేరుతో, స్టాక్ లేకపోయినా కోల్డ్ స్టోరేజ్ యజమానులకు ఈశ్వర్‌ప్రసాద్ 2023లో 1347 మందికి తాకట్టు అప్రైజర్ సర్టిఫికెట్లు జారీ చేసి రూ.కోట్లలో రుణాలు నొక్కేశారు. నాటి నల్లపాడు బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి 2 దఫాలు అక్కడే మేనేజర్‌గా పనిచేయడమే కాకుండా రెండేళ్లలోనే రెండుసార్లు ఉద్యోగోన్నతి పొందడం వెనుక ఇక్కడ జరిగిన కుంభకోణానికి సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈమె మేనేజర్‌గా ఉన్న సమయంలో బినామీ వ్యక్తుల పేర్లతో కోల్డ్ స్టోరేజ్ యజమానులు బ్యాంకుకు రాకుండానే వారి సిబ్బందిని పంపి ఎస్‌బీ ఖాతాలు తెరిచారు. రెండు లక్షలకు పైబడిన రుణాలను తప్పనిసరిగా బ్రాంచ్ నుంచి ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఖాతాలకు బదిలీ చేయాలి, కానీ నిబంధనల విరుద్ధంగా బ్యాంకులోనే విత్ డ్రా చేశారు. మిర్చిపై తాకట్టు రుణం తీసుకున్న గడువు ముగిసినా స్టాక్ వేలానికి చర్యలు తీసుకోలేదు. నాటి చైర్మన్ రాముతో పాటు నల్లపాడు బ్రాంచ్ మేనేజర్, నాటి సీఈవో, బ్యాంకు డైరెక్టర్లు, అప్రైజర్ అందరూ కుమ్మక్కై 22 కోట్ల 25 లక్షల 5 వేల 439 రూపాయల బోగస్ రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేశారని అధికారుల విచారణలో తేల్చారు.

- లింగాయపాలెంలోని విశ్వసాయి ఫుడ్స్ పేరుతో 12 కోల్డ్ స్టోరేజీలలో మిర్చి స్టాక్ ఉన్నట్లు బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు.

- అంకిరెడ్డిపాలెంలోని రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి స్టాక్ లేకపోయినా 13 కోట్ల 15 లక్షల 7 వేల 453 రూపాయలు బోగస్ రుణాలు పొందారు.

- నకిలీ డ్వాక్రా గ్రూపులు సృష్టించి వ్యక్తిగత, దీర్ఘకాలిక రుణాలు సుమారు 9 కోట్ల వరకు తీసుకున్నారు.

- వెంగళాయపాలేనికి చెందిన హోసన్నా మహిళ గ్రూప్ బోగస్ అని డీఆర్డీఏ నిర్ధారించినా రూ.14 లక్షలు రుణాలు ఇవ్వాల్సిందిగా నాటి మేనేజర్ అరుణ్‌కుమారి సిఫార్సు చేశారు.

- సంగడిగుంటకు చెందిన వీరబ్రహ్మేంద్ర మహిళా పొదుపు సంఘానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని ఆమె సిఫారసు చేశారు. అయితే అప్పటికే ఆ గ్రూప్ పేరుతో మరో బ్యాంకులో రూ.8.19 లక్షల రుణం బకాయి ఉంది.

- ఎటువంటి భూములు లేకపోయినా తప్పుడు పత్రాలు సృష్టించి 2021లో కొందరు రూ.9 కోట్లు రుణాలు తీసుకున్నారు. దీనిపై అప్పట్లో నల్లపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాగా ఆ కేసు విచారణను ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆయన కేసు విచారించి బ్యాంక్ మేనేజర్, మాజీ తహసీల్దార్ సహా ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు.

ఇప్పటికే రాముపై భూకబ్జా ఫిర్యాదు

లాల్‌పురంలో తాను 2011లో డీ నెంబర్ 324/ఎ లో 13 శెంట్ల భూమి కొనుగోలు చేసిన స్థలాన్ని రాము కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగొట్టాడని పట్టాభిపురానికి చెందిన ఉప్పు శంకరరావు రెండు రోజుల క్రితం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని కబ్జా చేసి గోడ కడుతుండగా పెద్దమనుషులను పంపి ప్రాధేయపడితే దూషించడమే కాక దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడన్నారు. దీనిపై విచారించాల్సిందిగా ఎస్పీ నల్లపాడు పోలీసులను ఆదేశించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠి త్రిపాఠి

సింగరాయకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీలేకుండా పటిష్టంగా పనిచేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠి త్రిపాఠి సూచించారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి జిల్లాలోని పోలీసుల పనితీరు, నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు, కీలక కేసుల పురోగతి, గంజాయి రావాణా, పలు అంశాలపై ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితులపై ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్, గస్తీ పెంచాలని సూచించారు. ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి కేసులు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. చెడు నడతగల వ్యక్తులపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. గంజాయి రావాణా, సరఫరా అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ చెకింగ్ వాహన తనిఖీలు, బారికేడ్లు రిఫ్లెక్టెడ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని, డ్రంకన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఒంగోలు, దర్శి, కనిగిరి డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర్, సీఐలు చావా హజరత్తయ్య, నాగారాజు, రామారావు, ప్రసాద్, రాజేష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో త్రీ సీటర్ చైర్స్ ఏర్పాటు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీజీహెచ్‌కు విచ్చేసే రోగులు, వారి సహాయకుల కోసం అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాలతో అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆసుపత్రిలో త్రీసీటర్ చైర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ఏబీజీ, ఐసీయూలో వేచి ఉండే రోగులు, వారి సహాయకుల కోసం వీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో అనేక మంది దాతలు ముందుకొచ్చి అవసరమైన కుర్చీలు బహూకరించారన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాలతో నూతనంగా 18 ప్రత్యేక చైర్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఇటీవల కాలంలో జీజీహెచ్‌లో అందుతున్న మెరుగైన వైద్యసేవలతో రోగుల సంఖ్య పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలను, వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మొంథా ఫైటర్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- పారిశుధ్య కార్మికులు, సచివాలయ, ఇంజనీరింగ్ సిబ్బందికి సన్మానం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నగరానికి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలతో సమర్థవంతంగా పనిచేసి, ఒంగోలుకు అవార్డు సాధించిన మొంథా ఫైటర్స్ సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సచివాలయ సెక్రటరీలు, ఇంజనీరింగ్ సిబ్బంది అభినందన సభ బుధవారం స్థానిక బాలాజీరావు తిరుపతి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రానికి మొంథా తుఫాన్ ముప్పు హెచ్చరికతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది జరగలేదన్నారు. నగరంలో కొంతమేర రోడ్లు దెబ్బతిని నష్టం వాటిల్లినప్పటికీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ఒంగోలుకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. ప్రజారోగ్యం కోసం ప్రతిరోజు కష్టపడి పనిచేసే కార్మికులు, సెక్రటరీలు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్ళాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని దామచర్ల హామీ ఇచ్చారు. ప్రత్యేక గుర్తింపుకార్డులు మంజూరు చేయడంతోపాటు మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి కార్మికుల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తామనిఅన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్దన్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు బియ్యంతోపాటు, నిత్యావసర సరుకులు అందజేసి సత్కరించారు. వారితోపాటు పలువురు సచివాలయ సెక్రటరీలను ప్రత్యేకంగా అభినందించారు.

అవీ.. ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు

గ్రూపు సభ్యులు పటిష్టంగా ఉండాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రూపు మహిళలందరూ ఆర్థికంగా బలోపేతం చెందాలంటే గ్రూపు, సంఘ సభ్యులు పటిష్టంగా ఉండాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్యలోని ఈసీ సభ్యులకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అ మలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోని ఆదర్శ వంతమైన గ్రూపులుగా తయారు కావాలని, అందుకోసం క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలపై అవగాహన పెంచి ఆర్థికంగా అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీ కోరె విజయభాస్కర్, సీసీలు విజయరాణి, బ్రహ్మయ్య, వెంకయ్య, యేసు, మండల సమాఖ్య ప్రతినిధులు షేక్ కరిమూన్, పచ్చవ భారతి, అంజమ్మ, మాలతి, అకౌంటెంట్ శ్యామల, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

చట్టాలను అతిక్రమిస్తే శిక్షార్హులు

● సీనియర్ న్యాయవాది రవీంద్రనాథ్‌రెడ్డి

పర్చూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చట్టాలను అతిక్రమిస్తే శిక్షార్హులు అవుతారని, చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సీనియర్ న్యాయవాది ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భవనం అంజిరెడ్డి, తులాబంధుల అర్జునయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూరిమెట్ల జాన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషకుమారి, న్యాయవాదులు కాసా అశోక్ కుమార్, షేక్.రుక్సానా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్నాయని నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 2వేల మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందర్, అద్దంకి కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, వీవోఏ సంఘం జిల్లా అధ్యక్షురాలు పుణ్యలక్ష్మి, మండల సంఘం నాయకులు కృష్ణకుమారి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

ఆటోనగర్ స్థలాలు వాస్తవ లబ్ధిదారులకు అందజేయండి

ఈపూరుపాలెం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం ఆటోనగర్ స్థలాలను వాస్తవ లబ్ధిదారులకు అందజేయాలని పలువురు చీరాల తాలూకా ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం వారు నిరసన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆటోనగర్ స్థలాలు గతంలో తమకే ఇస్తామని డీడీలు చెల్లించుకున్నట్లు చెప్పారు. అయితే ఐఏసీ మాట మార్చి స్థానికేతరులకు అప్పగిస్తున్నట్లు ఆరోపించారు.

హైందవ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ

ఈనెల 21వ తేదీన పట్టణంలోని ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ మైదానంలో హైందవ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈక్రమంలో అందుకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులతో కలిసి వాడరేవు ఆశ్రమ రామానంద స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మువ్వల వెంకటరమణ, తులసీరామ్, శివయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, మణి, మహేష్, మల్లికార్జున్, రఘు, సాయి, మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులకు లైఫ్ ఇన్సూరెన్స్ స్కాలర్‌షిప్

వేటపాలెం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విభాగం నుంచి దాక్షిణ్య, ఈసీఈ విభాగం విద్యార్థులు ఆర్ గీతా మాధురి, వీ. పావనీలు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వారి స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా బుధవారం కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డా.జగదీష్‌లు ప్రత్యేకంగా అభినందించారు. వీరికి ఏటా ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున నాలుగేళ్ల నగదు అందుతుందని చెప్పారు.

ఫ్రెండ్లీ పోలీస్

వాహనచోదకుల ప్రాణ రక్షణపై ప్రత్యేక దృష్టి

అపరాధ రుసుంకు బదులు తక్కువ ధరకు హెల్మెట్‌లు కొనుగోలు చేసేలా చర్యలు


వాహనచోదకులకు హెల్మెట్లు అందజేస్తున్న సంతమాగులూరు ఎస్‌ఐ

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనచోదకులు ప్రయాణిస్తుంటే సాధారణంగా పోలీస్‌శాఖ అధికారులు అపరాధ రుసుం విధిస్తూ ఉంటారు. వాహనచోదకులు కూడా ఎన్నిసార్లు అయినా అపరాధ రుసుం చెల్లింస్తుంటారే కాని హెల్మెట్ మాత్రం కొనుగోలు చేయడం లేదు. దీంతో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తుంటే కేసు నమోదు చేస్తే రూ.1,050 చెల్లించాల్సి ఉంటుంది. అయితే సంతమాగులూరు సీఐ కాకుమాను వెంకటరావు, ఎస్సై మేదరమెట్ల పట్టాభిరామయ్యలు వినూత్నంగా ఆలోచించారు. ద్విచక్ర వాహన చోదకుల జేబులు చిల్లు కాకుండా ఉండటంతో పాటు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలు రక్షించుకునే వీలుండే విధంగా హెల్మెట్‌లను కొనుగోలు చేయించాలని నిర్ణయించారు. దీంతో వాహనచోదకులకు భారం కాకుడదన్న ఉద్దేశంతో తక్కువ ధరకు హోల్‌సేల్‌గా తెప్పించి ఎలాంటి లాభం లేకుండా కొనుగోలు ధరకే స్థానికంగా అమ్మకాలు చేసేలా చర్యలు చేపట్టారు. సంతమాగులూరు మండలం అడ్డరోడ్డు వద్ద రెండు ద్విచక్ర వాహనాల షోరూమ్‌లు ఉండటంతో యజమానులతో సంప్రదించి సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయింపు చేసి అమ్మకాలు చేసేలా చర్యలు చేపట్టారు.

హెల్మెట్ సాధారణంగా 900 రూపాయలు నుంచి వెయ్యి రూపాయల వరకు ధర ఉంటుండగా నేరుగా కొనుగోలు చేయించటంతో 800 రూపాయలకే వచ్చాయి. ఆ మొత్తానే హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారి చేత కొనుగోలు చేయించే ప్రక్రియను చేపట్టారు. దీంతో ద్విచక్ర వాహనచోదకులు అపరాధ రుసుం చెల్లించే కంటే హెల్మెట్ కొనుగోలు చేయటం తక్కువ ఖర్చు అవుతుండటంతో ఎక్కువ మంది ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌లు కొనుగోలు చేయటానికే మొగ్గు చూపుతున్నారు. ఎస్సై పట్టాభిరామయ్య కూడా అపరాధ రుసుం విధించకుండా హెల్మెట్‌లు కొనుగోలు చేయించటంపైనే అవగాహన కల్పిస్తుండటంతో పలువురు అభినందిస్తున్నారు.

మినీ బైపాస్‌కు ముందస్తుగా.. గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణం లో మినీ బైపాస్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో కాలువ రెండు వైపులా కట్టలను విస్తరించేందుకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం నుంచి అభ్యుదయనగర్, వాసవినగర్ మీదుగా నామ్ రోడ్డు లో సూర్య రెస్టారెంట్ వద్ద కలిసే విధంగా సుమారు 1.6 కి.మీ దూరం సుమారు 15 కోట్ల రూపాయలతో మినీ బైపాస్ నిర్మాణం చేయనున్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కానున్న నేపథ్యంలో ముందస్తుగా కాలువకు రెండు వైపులా ఉన్న కట్టలను విస్తరించేందుకు గ్రావెల్ తోలుతున్నారు. మినీ బైపాస్‌గా మారనున్న ఎన్‌ఎస్‌పీ కాలువ వెడల్పు 70 అడుగుల నుంచి 90 అడుగుల వరకు ఉంది. కొన్ని చోట్ల 70 అడుగులు మాత్రమే ఉండటంతో మినీ బైపాస్ రోడ్డు మొత్తం 70 అడుగుల వెడల్పు ఉండే విధంగా నిర్మాణం చేసే అవకాశం ఉంది. ఎక్కువ వెడల్పు ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. కాలువ కట్టలను ఆక్రమించి నివాసాలు ఉండే కుటుంబాలకు ఇప్పటికే అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయించారు. స్థలాలు కేటాయించిన ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే రోడ్ల నిర్మాణం, బోర్లు ఏర్పాటు జరగగా మంగళవారం నుంచి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో త్వరలో ఇళ్లు ఖాళీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

మినీ బైపాస్ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేయనున్న నేపథ్యంలో నేల పటిష్టంగా ఉండేందుకు ముందస్తుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. దీంతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం వేగవంతంగా పూర్తయ్యే అవకాశం ఉంది.


అద్దంకిలో కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు తోలుతున్న గ్రావెల్


అద్దంకి కొండ వద్ద పునరావాసం కోసం కేటాయించిన స్థలాలలో వేస్తున్న విద్యుత్ లైన్లు, నిర్మాణం చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

వైభవంగా ఇరుముడి పూజలు

చినగంజాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసి యున్న హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప దీక్షాధారుల ఇరుముడి పూజల కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానంలోని స్వామివారిని ఆలయ పూజారి విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్‌ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో గురుస్వాములు నరహరి బుజ్జాయి, చెరుకూరి రాఘవయ్య, రాయని వెంకటేశ్వరరావులు దీక్షధారణ చేసిన 75 మంది అయ్యప్పస్వాములకు శాస్త్రోక్తంగా ఇరుముడుల కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవస్థాన ప్రాం గణం అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమోగింది. గ్రామానికి చెందిన పర్వతరెడ్డి వెంకటరావు, యానాదమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు బ్రహ్మనాయుడు, నాగేశ్వరరావు, వాసుదేవరావులు ఆల య ప్రాంగణంలో దీక్షాధారులకు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


అయ్యప్పస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పార్వతీ పరమేశ్వరుని నృత్య ప్రదర్శన తిలకిస్తున్న దీక్షాధారులు

పడిపూజా మహోత్సవం

- అలరించిన పార్వతీ పరమేశ్వరుల నృత్య ప్రదర్శన

హరిప్రసాద్‌నగర్(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని హరిప్రసాద్‌నగర్‌లో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున దీక్షాధారులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా పార్వతీ పరమేశ్వరుల వేషధారణాలతో కళాకారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌ను రద్దు చేయాలి

● యూటీఎఫ్ నేతల డిమాండ్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న టీచర్లు రెండు సంవత్సరాలలోపు టెట్ పరీక్ష పాస్ అవ్వాలని, లేకుంటే వారిని సర్వీస్ నుంచి తొలగించాలనే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి. పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలని కోరుతూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ నిర్ణయం వలన రాష్ట్రంలో దాదాపు లక్ష మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. స్థానిక బంగ్లారోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈకార్యక్రమంలో అధ్యక్షుడు ఈ. రామారావు, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు జె. బాబురావు, సోమేపల్లి హనుమంతరావు, బి.వి.రత్నం, చంద్రశేఖర్, కే. గంగాధర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ర్యాలీ

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా అద్దంకి నియోజకవర్గంలో సంతకాలు సేకరించారు. సేకరించిన సంతకాలను జిల్లా కార్యాలయంకు పంపించే కార్యక్రమంలో భాగంగా బుధవారం వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కర్నేటి వెంకట ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల వైసీపీ నేతలు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలి

అద్దంకి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలని న్యాయవాది టి. మార్తాశ్రీను అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహ్మద్‌రఫీ,. దనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరీమహాదేవి 236వ ఆరాధన

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీ రబ్రహ్మేంద్ర స్వామి వారి మనుమరాలు ఈశ్వరీమహాదేవి 236వ ఆరాధన , గురుపూజ మహోత్సవం ఈ నెల 13వ తేదీన కాకానిపాలెం వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో జరుగుతుందని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 7 గంటలకు అష్టోత్తర అభిషేకం జరుగుతుందని తెలిపారు. భక్తులు అందరు పాల్గొని తీర్థ ప్రసాదాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ఏలూరి వీరబ్రహ్మాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు, చోడా వెంకట సుబ్బారావులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

మదురై రోడ్డు ప్రమాదంలో దీక్షాధారుడి మృతి

● శబరిమల నుంచి తిరిగి వస్తున్న సమయంలో ఘటన

● అక్కయ్యపాలెం గ్రామంలో విషాదఛాయలు




ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు (ఇన్‌సెట్లో వెంకటరావు (ఫైల్)

అక్కయ్యపాలెం(చీరాల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మదురైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేటపాలెం మండలం అక్కయ్యపాలెంకు చెందిన అయ్యప్ప దీక్షాధారుడు మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గవిని వెంకటరావు(47) ఆటో డ్రైవర్. ఇతనికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన ఆయన అందరితో కలిసి రెండు బస్సులలో ఈనెల 4వ తేదీన శబరిమల వెళ్లారు అక్కడ ఇరుముడి చెల్లించుకుని తిరిగివచ్చే క్రమంలో మదురై వద్ద భిక్షచేసేందుకు జాతీయ రహదారి వెంబడి ఆగారు. ఈనేపథ్యంలో అక్కడ రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వెంకటరావును వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదురై రీజనల్ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

గ్రామీణ రహదారులకు మహర్దశ

● రూ.10 కోట్లతో అంతర్గత రోడ్లకు శ్రీకారం

● ప్రజలకు తీరనున్న కష్టాలు


ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

చీరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతవాసుల కష్టాలు తీరనున్నాయి. కూటమి ప్రభు త్వం పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.10 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో గ్రామాల్లో సుమారు 20 కిలో మీటర్లు అంతర్గత రహదారుల ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే కొండయ్య పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలో సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారు. దీంతో వేటపాలెం - తిమ్మ సముద్రం రహదారి, ఈపూరుపాలెం నుంచి గవినివారి పాలెం , పుల్లాయి పాలెం వయా వెదుళ్లపల్లి వరకు నిర్మాణాలు చేయనున్నారు. అంతేకాకుండా దండుబాట రోడ్డు నుంచి రంగప్పనాయుడు వారి పాలెం వరకు, జీబీసీ రోడ్డు నుంచి వయా కొత్తపాలెం మీదుగా గాంధీనగర్ వరకు, చెన్నకేశవస్వామి టెంపుల్ నుంచి వయా దండుబాట మీదుగా పాత చీరాల వరకు, వాడరేవు నుంచి కీర్తివారి పాలెం మీదుగా బుర్లవారిపాలెం వరకు అలాగే ఈసూబ్‌నగర్ నుంచి బోయినవారి పాలెం వరకు రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. దీంతో సుదీర్ఘకాల సమస్యలు పరిష్కారం కానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో 8 జీవాలు మృతి


మృతిచెందిన గొర్రెలను చూపుతున్న బాధితురాలు

ఇంకొల్లు, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగండ్లలో మంగళవారం అర్ధరాత్రి ఓ కొష్టంలో ఉన్న గొర్రెలపై వీధికుక్కలు దాడి చేయడంతో 8 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మేకల అంజనా గొర్రెలను మేపుకున్న అనంతరం మంగళవారం రాత్రి తమ కొష్టంలో ఉంచగా అర్ధరాత్రి వేళలో వీధి కుక్కలు దాడి చేశాయని బాధితురాలు తెలిపింది. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని, గొర్రెలు మృతి చెందటంతో జీవనోపాధి కోల్పోయానని బాధితురాలు వాపోయింది. ఘటనా స్థలాన్ని గ్రామసర్పంచ్ కంచుగంటి పద్మ పరిశీలించారు.ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆమె విన్నవించింది.

కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా 'బాచిన' నియామకం


బాచిన హనుమంతరావు

పంగులూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా పంగులూరుకు చెందిన బాచిన హనుమంతరావు నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం తరుపున కేసులు వాదించేందుకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ పలువురు న్యాయవాదులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో పంగులూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది బాచిన హనుమంతరావుకు చోటు లభించింది. హైకోర్టు న్యాయవాది బాచిన హనుమంతరావు ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగే అవకాశం కల్పించింది. ఆయన గతంలో హైకోర్టు న్యాయవాదుల సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. న్యాయవాది బాచిన హనుమంతరావు ప్రస్తుతం పలు నేషనలైజ్డ్ బ్యాంకులకు ప్యానల్ అడ్వకేట్‌గా కొనసాగుతున్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.పువ్వాడ రామకోటేశ్వరరావు సౌజన్యంతో 10వ తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు యూటీఎఫ్ వారి స్టడీ మెటీరియల్ అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాచిన పూర్ణచంద్రరావు తెలిపారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

అద్దంకిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు నానో యూరియా వాడకం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యాన శాఖ హెచ్‌వో ఎస్. దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని కొటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పలు పంటలను ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఎకరాకు 500 ఎంఎల్ వాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు సుకన్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల ఉద్యానశాఖ హెచ్‌వో దీప్తి